RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 115 | బుధవారం, జూన్ 5, 2024 | పేజీలు : 4

## ఆధిక్యంలో బిజెపి అభ్యర్థి డికె. అరుణ

మహబూబ్ నగర్: అన్ని రౌండ్లు కౌంటింగ్ ముగిసేసరికి బిజెపి అభ్యర్థి డికె. అరుణ 1800 ఓట్ల తేడాతో ఆధిక్యంలో ఉన్నారు. మహబూబ్ నగర్ ఎంపీ ఫలితం ఉత్కంఠ రేపుతోంది. ప్రస్తుతం 7500 ఓట్ల పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది.

## ఏపీలో రెండో అతి పెద్ద పార్టీగా జనసేన!



**పిఠాపురం:** ఏపీలో రెండో అతి పెద్ద పార్టీగా జనసేన అవతరించనుంది. ఏపీలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కౌంటింగ్ లో జనసేన పార్టీ ప్రభంజనం సృష్టిస్తోంది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లోనూ గెలుపు దిశగా జనసేన ఆధిక్యంలో దూసుకుపోతోంది. రెండు లోక్ సభ స్థానాల్లో కూడా గెలుపు బాటలో జనసేన పయనిస్తోంది. దీంతో 100 శాతం స్ట్రైక్ రేటుతో జనసేన దూకుడు ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలో జనసేనకు గ్లాజు గాసు గుర్తు ఇకనుంచి శాశ్వతం కానుంది. కాగా, 21 స్థానాల్లో ఇప్పటికే ఏడు స్థానాల్లో జనసేన గెలుపొందింది. పిఠాపురంలో జనసేనాని 50వేల మెజార్టీతో ఘన విజయం సాధించారు.

## సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం

సికింద్రాబాద్: భారత రాష్ట్ర సమితి సిట్టింగ్ స్థానం సికింద్రాబాద్ కంటోన్మెంట్ కు జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్, నివేదితపై గెలుపొందారు. దీంతో అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 65 చేరితే, బిఆర్ఎస్ బలం 38కి జారింది. ఇదిలావుండగా తెలంగాణలోని 17 ఎంపీ స్థానాల్లో బిఆర్ఎస్ ఏదీ గెలవకుండా శూన్య స్థానానికే పరిమితమైంది. బిఆర్ఎస్ మెదక్ పై ఆశ పెట్టుకున్నప్పటికీ అక్కడ కూడా బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు భారీ మెజార్టీతో ముందుకు దూసుకెళుతున్నారు.







## హిందూపురంలో బాలకృష్ణ హ్యాట్రిక్ విజయం

**హిందూపురం:** ఆంధ్రప్రదేశ్ లోని హిందూపురంలో నందమూరి బాలకృష్ణ వరుసగా మూడోసారి గెలిచి చరిత్ర సృష్టించారు. గత రెండు ఎన్నికల కంటే ఈసారి భారీ మెజారిటీ సాధించారు. తన సమీప అభ్యర్థి కోడూరి దీపికపై 31602 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. బాలకృష్ణ తండ్రి, ప్రముఖ నటుడు నందమూరి తారక రామరావు కూడా హిందూపురం నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎంఎల్ఏగా గెలుపొందారు. వారి కుటుంబానికి ఈ నియోజకవర్గం అచ్చివచ్చినట్లుంది.

## మండిలో కంగనా రనౌత్ విజయం



**మండి:** బాలీవుడ్ నటి కంగనా రనౌత్ రాజకీయ అరంగేట్రంలోనే జయ కేతనం ఎగురవేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి పార్లమెంటరీ నియోజకవర్గంలో బిజెపి తరపున పోటీ చేసిన కంగన తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి విక్రమాదిత్య సింగ్‌పై 72008 వోట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. లోక్‌సభ ఎన్నికల ఏడవ దశలో భాగంగా మండిలో ఈ నెల 1న పోలింగ్ జరిగింది. కంగన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 'మేము ఈ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ పేరుపై పోరాడాం. ఆయన విశ్వసనీయత, హామీ, ప్రజల్లో ఆయనపై ఉన్న విశ్వాసం ఫలితంగానే మేము మూడవ సారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నాం' అని చెప్పారు. మరొక వైపు హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థి అనురాగ్ ఠాకూర్ కూడా విజయం సాధించారు.





అమరావతి : ఏపీలో ఓటమిపై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం వెలువడ్డ ఫలితాల అనంతరం తాడేపల్లిలోని నివాసంలో సాయంత్రం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురి చేశాయి. ఊహించని విధంగా ఫలితాలు వస్తాయని అనుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అవ్వతాతలు, అక్కాచెల్లెమ్మలు, రైతన్నలు చూయించిన ఆప్యాయత, ప్రేమానురాగాలు ఫలితాల్లో ఏమయ్యాయో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలిచాలని పెన్షన్ ను పెంచి అవ్వ,తాతల ఇంటి వద్దకే వెళ్లి అందజేశాం. వారి ఆప్యాయత ఏమైందో తెలియదు. అక్క చెల్లెలకు అన్ని రకాలుగా అండగా ఉన్నాం. జీరో వడ్డీ, ఆసరా, చేయూతను అందించాం, కోటి 5 లక్షల మంది అక్క చెల్లెళ్ల ప్రేమాభిమానులు ఏమయ్యాయో తెలియదని అన్నారు. పిల్లల చదువుల కోసం 12 లక్షల తల్లులు అకౌంట్లోకి డబ్బులు జమ చేశారు. 54 లక్షల మంది రైతన్నలకు పెట్టుబడి సహాయం ఇచ్చాం. వీరి ఆప్యాయతా ఏమైందో తెలియదని అన్నారు. కోట్లాది మందికి మంచి చేసినా ఎక్కడ పొరపాటు జరిగిందో ఊహించలేక పోతున్నామని జగన్ తెలిపారు. అందరికీ మంచి జరగాలని ఆరాటపడ్డాం. ప్రజల కోసం మేలు జరుగాలని తాపత్రయపడ్డాం. ఎప్పుడు చూడని విధంగా మార్పులు తీసుకువస్తూ పేదలకు అండగా పనిచేశాం. గొప్ప పనులు చేసినా తరువాత వారి అభిమానం, ఆప్యాయత ఏమైందో తెలియని వివరించారు. ఏం జరిగిందో దేవుడికి తెలుసు. ఓటమి నెపాన్ని ఎవరిని ప్రశ్నించమని, ప్రజల తీర్పును శిరసా వహిస్తామని పేర్కొన్నారు. పేదలకు అండగా ఉంటాం . పేదల పక్షాన అసెంబ్లీ లో ప్రతిపక్షంగా గళం విప్పుతామని స్పష్టం చేశారు.

## కేంద్రంలో ఎపిదే కీలక పాత్ర

అమరావతి: ఎన్నికల రణక్షేత్రంలో అన్నిసార్లు పార్టీల వ్యూహాలు ఫలించవు. ఈసారి తిరుగులేని విజయం సాధిస్తామని, 400 పైగా సీట్లు వస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ సహా ఎన్‌డిఎ నేతలంతా ధీమా వ్యక్తం చేశారు. అయితే ప్రతిపక్షం పట్టుదలగా పోరాడి ఎన్‌డిఎ మెజార్టీని బాగా తగ్గించింది. కానీ బిజెపి కూటమిని అధికారంలోకి రాకుండా మాత్రం అడ్డుకోలేకపోయింది. గత ఎన్నికల్లో 353 సీట్లు సాధించిన ఎన్‌డిఎ ఈసారి 300 మార్కును దాటడానికి కష్టపడింది. ఎప్పటిలాగే బిజెపి కంచుకోట రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఆదుకున్నా, ఈ సారి అనూహ్యంగా దక్షిణాదిలో ఎన్‌డిఎ కూటమికి బలం చేకూరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలో చెప్పుకోదగ్గ సీట్లు సాధించగా, చరిత్రలో తొలిసారి కమ్యూనిస్టు కంచుకోటలోనూ ఖాతా తెరిచింది.



## యూపీలో మళ్లీ పుంజుకున్న అఖిలేశ్ యాదవ్




లక్నో: అఖిలేశ్ యాదవ్ తాలూకు సమాజ్ వాదీ పార్టీ మళ్లీ యూపిలో పంజుకుంది. అక్కడి బిజెపి సీట్లను తగ్గించిపారేసింది. ప్రస్తుత ట్రెండ్ ప్రకారం సమాజ్ వాదీ పార్టీ 33 స్థానల్లో, బిజెపి 36 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. ఉత్తర్ ప్రదేశ్ లో బిజెపి స్వీప్ చేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ ఇదివరకు చెప్పారు. కానీ వాస్తవిక పరిస్థితులు ఇప్పుడు భిన్నంగా ఉన్నాయి. 1973 జులై 1న జన్మించిన అఖిలేశ్ యాదవ్ ప్రతిపక్షాల ప్రచారంలో ముందున్నారు. ఆయన మమతా బెనర్జీ, కేజ్రీవాల్ వంటి వారితో కలిసి పనిచేస్తున్నారు. ములాయం సింగ్ స్థాపించిన సమాజ్ వాదీ పార్టీ బాధ్యతలను ఇప్పుడు అఖిలేశ్ యాదవ్ తీసుకున్నారు. 2004లో గెలిచిన సీట్లకన్నా ఇప్పుడు సమాజ్ వాదీ పార్టీ మెరుగైన సీట్లనే పొందుతోంది.

## మధ్యప్రదేశ్‌లోని గుణ నియోజకవర్గంలో జ్యోతిరాదిత్య సింధియా విజయం

జ్యోతిరాదిత్య సింధియా మధ్యాహ్నం 1.30 గంటల సమయానికి, తన కాంగ్రెస్ ప్రత్యర్థి యద్వేంద్రరావు దేశరాజ్ సింగ్ కంటే 4,44,640 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. 2019 ఎన్నికలలో సింధియా కాంగ్రెస్ అభ్యర్థి, బిజెపికి చెందిన కృష్ణ పాల్ సింగ్ చేతిలో 10.65% తేడాతో ఓడిపోయారు. ఈ ఎదురుదెబ్బ ఉన్నప్పటికీ, సింధియా కుటుంబానికి గుణాలో ఒక కథా, చరిత్ర ఉంది, జ్యోతిరాదిత్య అమ్మమ్మ విజయ రాజే సింధియా 1989 నుండి 1998 వరకు ఈ ప్రాంతానికి బిజెపి సభ్యురాలిగా ప్రాతినిధ్యం వహించారు. జ్యోతిరాదిత్య తండ్రి కూడా 1971 నుండి 1980 వరకు కాంగ్రెస్ సభ్యునిగా గుణ సీటును గెలిచుకున్నారు. 2001లో ఆయన మరణానికి ముందు, 1999లో జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్‌లో చేరారు, 2002లో బిజెపి అభ్యర్థి అయిన దేశ్ సింగ్ యాదవ్‌పై ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. టెలికమ్యూనికేషన్స్, వాణిజ్యం , పరిశ్రమలు , విద్యుత్‌తో సహా వివిధ మంత్రి పాత్రలలో పని చేస్తూనే, అతను 2004, 2009 మరియు 2014 ఎన్నికలలో నియోజకవర్గంపై తన పట్టును కొనసాగించారు.




## పిఠాపురంలో జనసేనాని పవన్ కల్యాణ్ ఘన విజయం



పవర్ స్టార్, జనసేనాని పవన్ కల్యాణ్ అసెంబ్లీ ఎన్నికలో భారీ విజయం సాధించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతపై 50వేల మెజార్టీతో పవన్ గెలుపొందారు. దీంతో ఆయన ఏపీ అసెంబ్లీలో తొలి ఎమ్మెల్యేగా అడుగుపెట్టనున్నారు. మరో ఎన్డీఎ కూటమి సునామీ సృష్టించింది. రాష్ట్రంలో మొత్తం 175కు 162 అసెంబ్లీ స్థానాల్లో కూటమి ఆధిక్యంలో దూసుకుపోతోంది. దీంతో కూటమి విజయం ఖాయమైంది. ఇక, జనసేన పోటీ చేసిన 21 స్థానాలకు 21 సీట్లలో గెలుపు దిశగా పయనిస్తోంది. ఈ ఎన్నికల్లో వైసీపీ కేవలం 13 సీట్లలోనే ముందంజలో కొనసాగుతోంది.

## సంపాదకీయం

# అగ్నిపథంతో యువతకు నిరాశే..!

నాలుగేళ్ల తర్వాత 25% యోగ్యులు 4 ఏళ్ల సేవను కోల్పోయి కొనసాగుతారు. 75% అయోగ్యులు ఇంటికి పోతారు. నియామకంలో అయోగ్య లుంటారా? ఈ 75% అగ్నివీరులు భావితరాల్లో ఆత్మగౌరవాన్ని నింపుతారట! బిజెపి కార్యాలయాల భద్రతా సిబ్బందిగా అగ్నివీరులకు ప్రాధాన్యత నిస్తామని బిజెపి ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయవర్ఘీయ గర్వించారు. ఇదీ అగ్నివీరులకు బిజెపి గౌరవం. సంఘ్ స్వభావులు సైన్యంలో కొనసాగుతారు. బయటికొచ్చేవారు సంఘ్ ధర్మసేన, బజరంగ్ దళాల శిక్షకులు, సభ్యులు అవుతారు. తాత్కాలిక సైన్యం అపాయమని పలువురు పూర్వ సైన్యాధికారులు హెచ్చరించారు. అధికారానికొస్తే అగ్నిపథ్‌ను రద్దు చేస్తామంది కాంగ్రెస్. రెట్టలావు కోపంతో రెచ్చిపోయారు మోడీ. సైన్యాన్నే కించపర్చారని వక్తించారు. మోడీ సర్కారు 14 జూన్, 2022న ప్రకటించిన 3.5 ఏళ్ల కురచకాల కొత్త ఒప్పంద సేనా నియామక పథకానికి అగ్నిపథ్ అని, సైనికులకు అగ్నివీరులని పేర్లు పెట్టింది. గుజరాత్ ప్రచారకర్త, సిని నటుడు అమితాబ్ దీక్షిత్ తండ్రి హరివంశరాయ్ దీక్షిత్ (బచ్చన్ ఆయన కలం పేరు) 'అగ్నిపథ్' హిందీ కవిత రాశారు. 1990లో అదే పేరుతో దాన్ని సినిమా తీశారు. అమితాబ్ అభిమానులను ఆకర్షించడానికి తాత్కాలిక సైన్యానికి అగ్నిపథ్ పేరు పెట్టారు. పెన్షన్ ఖర్చు తగ్గింపు అగ్నిపథ్ లక్ష్యం. ప్రభుత్వ పెన్షన్ కు 20 ఏళ్ల, పూర్తి పెన్షన్‌కు 33 ఏళ్ల సేవ తప్పనిసరి. సిపాయి 20 ఏళ్లకు రిటైరైతే అర్హత పెన్షన్‌ను 20/33 తో గుణించి పెన్షన్‌ను నిర్ణయిస్తారు. ఉపయుక్త పెన్షన్ 30.3% కు పడిపోతుంది. ప్రజా ప్రతినిధులు ఒక్క రోజు చేసినా జీవితాంతం పెన్షన్ వస్తుంది. 790 ఎంపిలు, 4,121 ఎం.ఎల్.ఎ.లు, 454 ఎం.ఎల్.సి.లు, లెక్కల్లో లేని పలువురు మాజీ, పూర్వ సభ్యులు, 4,575 మంది ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు పెన్షన్ తీసుకుంటున్నారు. ఎంపిల కనీస పెన్షన్ రూ. 25 వేలు. ప్రతి ఏడాది సేవకు రూ.2 వేలు కలుస్తుంది. ఒక వ్యక్తి ఎంపిగా, ఎంఎల్‌ఎగా, ఎంఎల్‌సిగా చేస్తే 3 పెన్షన్లు వస్తాయి. మంత్రికి మంత్రి జీతం, ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి, ఎంపి జీతం, పెన్షన్ మూడూ వస్తాయి. ఒక సభ్యునికి పెన్షన్, జీతం రెండూ ఇస్తారు. సభకు హాజరేకాని నటులు చిరంజీవి, రేఖ, వైజయంతిమాల, క్రీడాకారుడు తెండూల్కర్, పలువురు పారిశ్రామికవేత్తలు పెన్షన్లు తీసుకుంటారు. నట-రాజకీయ తమిళనాడు పూర్వ ఎంపి ఆర్. శాంతకుమార్ ఒక్కరే పెన్షన్ నిరాకరించారు. ఎంపిల జీతభత్యాల, పెన్షన్ల పద్ధతి న్యాయ సమ్మతమని 2018లో మోడీ సర్కారు సుప్రీం కోర్టుకు చెప్పింది. సైన్య యౌవనం అగ్నిపథ్ మరో లక్ష్యం. నేటి 32 ఏళ్ళ సగటు కంటే అగ్నిపథ్ ఇచ్చే 26 ఏళ్ల సగటు ప్రయోజనం ఎంత? యువత, అనుభవజ్ఞుల నిష్పత్తిని క్రమేపీ 1:1 చేస్తారట. యుద్ధంలో శిక్షణ, అనుభవం, నైపుణ్యం ప్రధానం. నేటి 1.5 ఏళ్ల శిక్షణ కంటే 6 నెలల శిక్షణ సామర్థ్యాన్ని పెంచలేదు. మూడో వంతు శిక్షణతో వృత్తి నైపుణ్య ప్రత్యేక సాధన లేని సైనికులు బ్రహ్మోస్, పినాక, వజ్ర వంటి అత్యాధునిక ఆయుధాలను వాడలేరు. పాకిస్తాన్, చైనాల దొంగ దాడులను ఎదుర్కోలేరు. అభిమన్య అగ్నివీరులు చక్రవ్యూహాన్ని ఛేదించలేరు. అనుభవ అవసరాన్ని ప్రభుత్వం గుర్తించ లేదు. ఉపాధి కల్పన అగ్నిపథ్ మరో మేలని రాజకీయ ప్రకటన. ఇది నిరుద్యోగాన్ని తగ్గించి, ఆర్థిక స్థిరత్వాన్ని పెంచి, సమగ్రాభివృద్ధిని సాధిస్తుందట! 50 కోట్ల నిరుద్యోగంలో 50 వేల తాత్కాలిక ఉద్యోగాలు ఇంత పని చేస్తాయా? కోవిడ్ సాకుతో ఆపిన ఖాళీలు 1.3 లక్ష. అగ్నిపథ్ దాకా ఏడాదికి 65 వేల ఉద్యోగాలిచ్చారు. అగ్నిపథంలో మొదటి ఏడు 46 వేలు, మరుసటి ఏడాది నుండి 50 వేల మందిని నియమిస్తామన్నారు. దీంతో ఉపాధి ఏడాదికి 15 వేలు తగ్గింది. కుల మత ప్రాంత ఆధారిత నియామకాలు రద్దవుతాయని అభాండ ప్రకటన. ప్రభుత్వం ప్రస్తావించిన రెజిమెంటల్ పద్ధతి బ్రిటిష్ ప్రభుత్వం యోచించి చేసింది. 75 ఏళ్ల నుండి ఈ పద్ధతి ప్రయోజనాలను గుర్తించారు. రెజిమెంట్ల, యూనిట్/ సబ్ యూనిట్ల పొందిక యుద్ధంలో ప్రధాన ప్రేరణ. వీటిలో కుల మత ప్రాంత ప్రసక్తి లేదు. ప్రతి రెజిమెంటులో అన్ని కుల మతాల దేశ వ్యాప్త పౌరులను నియమిస్తారు. బ్రిటిష్ వారు ప్రాంతాలకు, ప్రాంతీయ నాయకులకు ప్రాధాన్యతనిచ్చి ప్రాంతీయ గౌరవాన్ని పెంచారు. అదే గౌరవాన్ని రెచ్చగొట్టి మన సైనికులతోనే స్వతంత్ర సమర వీరులను కొట్టించారు. బ్రిటిష్ సైన్యంలో కశ్మీర్ పదాతి దళంలో తక్కువ స్థాయి వారికి, మరాఠా మహర్ (షెడ్యూల్డ్ కులం)లకు ప్రత్యేక దళాలుండేవి. స్వతంత్ర భారత సైన్యంలో వీటిని తగ్గించారు. అనేక దేశాల్లో తాత్కాలిక సైన్యముందని సర్కారు వాదన. మోడీ నమూనాగా తీసుకున్న ఇజ్రాయిల్ సైన్యంలో ఐచ్ఛిక, నిర్బంధ రకాల సైన్యముంది. ఇజ్రాయిల్ నిర్బంధకాలం మగాళ్ళకు 30 నెలలు, స్త్రీలకు 22 నెలలు. దక్షిణ కొరియా పదాతి, నావికా, వైమానిక దళాలకు వరుసగా 21, 24, 25 నెలలు. చైనా, అమెరికాల నిర్బంధ కాలం 2 నుండి 8 ఏళ్ళు. రష్యా, బ్రెజిల్ లలో ఇది 12 నెలలు.

# మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో మొట్టమొదటిసారి బిజెపి జెండా ఎగరవేసి చరిత్ర సృష్టించిన ఈటెల రాజేందర్

### - భారీ మెజారిటీతో గెలుపొందిన ఈటెల రాజేందర్

### - మల్కాజ్గిరి రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా ధ్రువపత్రాన్ని అందుకున్న ఈటల రాజేందర్



**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా (గరుడ వార్త) :** ముచ్చటగా మూడోసారి కూడా ప్రజలు బిజెపికే పట్టం కట్టారని అందుకు మోదీ పరిపాలన దక్షతనే కారణమని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. అఖండ విజయాన్ని ఇచ్చిన ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటూ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పునరుద్ఘాటించారు. 3,91475 ఓట్ల మెజారిటీతో ఈటెల రాజేందర్ ఘనవిజయం సాధించారు. రాజేందర్ కు 99142 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి కి 599567 ఓట్లు రాగా, భారతీయ రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి రాగి లక్ష్మారెడ్డికి 300486 ఓట్లు వచ్చాయి. కాగా మొదటి రౌండు నుండే ఈటెల రాజేందర్ తన తన ఆధిక్యతను కొనసాగిస్తూ వచ్చారు. మొదటి రౌండ్ మొదలు చివరి రౌండు వరకు ప్రతి రౌండ్ రాజేందర్ తన ఆధిక్యతను పెంచుకుంటూనే వచ్చేరు . మొత్తానికి త్రికోణపు పోటీ అనుకున్న మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అఖండ మెజారిటీతో గెలుపొంది త్రికోణపు పోటీ కాదు ఏకచిత్తరాధిపత్యంతో రికార్డ్ ను బిజెపి పార్టీ సృష్టించింది. ఓట్ల లెక్కింపు పూర్తయిన మల్కాజ్గిరి రిటర్నింగ్ అధికారి చేతులు మీదుగా ఈటెల రాజేందర్ ధ్రువపత్రాన్ని అందుకున్నారు.

# స్ఫూర్తిదాయకమైన కార్యక్రమంతో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని జరుపుకున్న 'ఎజైకిల్'

### -నగరం వేదికగా సైక్లింగ్ యొక్క ఆహ్లాదం, ఆరోగ్య ప్రయోజనాలను ప్రదర్శించిన సైక్లింగ్ ప్రియులు






**హైదరాబాద్, 4 జూన్:** ఎలక్ట్రిక్ సైకిళ్లలో ప్రముఖ ఆవిష్కర్త అయినటువంటి 'ఎజైకిల్' ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవ నేపథ్యంలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా సైక్లింగ్ ఔత్సాహికులు, వివిధ కమ్యూనిటీ నాయకులతో పాటు విశిష్ట అతిథులను ఒకచోట చేర్చ....ఆరోగ్యం, సుస్థిరత, సమాజ శ్రేయస్సు కోసం సైక్లింగ్ ప్రయోజనాలను ప్రోత్సహించేలా స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రెస్టీన్ ప్రైమ్ మాల్ వేదికగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మిస్టర్ వరల్డ్ సిల్వర్ మెడలిస్ట్ మీర్ మోతేషామ్ ముఖ్య అతిథిగా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఎజైకిల్ సీఈఓ శ్రీ శ్రీనివాస్.డి తో పాటు పలువురు సైక్లింగ్ ఔత్సాహికులు పాల్గొన్నారు. ఈ వినూత్న కార్యక్రమం పచ్చదనం, ఆరోగ్యకరమైన భవిష్యత్తును పెంపొందించడంలో సైకిళ్ల పాత్రను హైలైట్ చేసింది. ఈ సందర్భంగా శ్రీ మీర్ మోతేషాం తన ప్రయాణాన్ని, పట్టుదల యొక్క ప్రాముఖ్యతను పంచుకున్నారు. వినూత్న ఎలక్ట్రిక్ సైకిళ్ల ద్వారా రవాణాలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఎజైకిల్ సంస్థ కృషి, మిషన్ గురించి పలు అంశాలను సీఈఓ శ్రీ శ్రీనివాస్.డి వెల్లడించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సైక్లింగ్ ర్యాలీలో అన్ని వయసులకు చెందిన సైక్లింగ్ ప్రియులు పాల్గొని సైక్లింగ్ యొక్క ఆహ్లాదం, ఆరోగ్య ప్రయోజనాలను ప్రదర్శించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఔత్సాహికులు ఎజైకిల్ తాజా ఆవిష్కరణ ఎలక్ట్రిక్ సైకిల్ మోడల్‌ల యొక్క ప్రయోగాత్మక ప్రదర్శనలను ఆస్వాదించారు. దీని సౌలభ్యం, పర్యావరణ అనుకూల లక్షణాలను సైక్లిస్టులను విశేషంగా ఆకట్టుకుంది. అంతేకాకుండా ఈ కార్యక్రమంలో సైక్లింగ్ భద్రత, నిర్వహణ, ఎలక్ట్రిక్ సైకిళ్ల ప్రయోజనాలపై సమాచార వర్క్‌షాప్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజైకిల్ సీఈఓ శ్రీనివాస్ %ణ% మాట్లాడుతూ., "ప్రపంచ సైకిల్ దినోత్సవం నేపథ్యంలో మనమంతా ఒక వేదికపైకి చేరి మార్పుకు నాంది అయినటువంటి సైకిల్ వేడుకలు చేసుకోవడం మంచి అనుభూతి. ఎజైకిల్ ఆధ్వర్యంలో సైక్లింగ్ చేయడానికి, చేయించడానికి కట్టుబడి ఉన్నాము. అందరికీ అనువైన, స్థిరమైన సైక్లింగ్ వృద్ధికి మా మిషన్ నిదర్శనంగా నిలుస్తుందని" తెలిపారు. ముఖ్య అతిథి శ్రీ మీర్ మోతేషామ్ మాట్లాడుతూ., "నా శిక్షణతో పాటు జీవితంలో కూడా సైక్లింగ్ ఒక ముఖ్యమైన భాగం. ఈరోజు ఇక్కడ సైక్లింగ్‌కు మద్దతు చూపించిడం చాలా సంతోషాన్నిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలిని, పరిశుభ్రమైన వాతావరణాన్ని ప్రోత్సహిస్తాయని" పేర్కొన్నారు.

## పవర్ స్టోమ్

కాకినాడ: అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన అధిపతి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ భారీ విజయం దూసుకెళుతున్నారు. పిఠాపురం నుంచి బరిలోకి దిగిన ఆయన తన సమీప ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి వంగా గీతపై ఇప్పటికే సుమారు 30 వేలకు పైగా ఓట్ల ఆధిక్యంలో ఉన్నారని తెలుస్తోంది. ఇదే ట్రెండ్ కొనసాగితే పవన్ కు భారీ మెజారిటీ దక్కడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయినా పవన్ ఇప్పుడు భారీ మెజారిటీతో దూసుకెళుతుండడంతో జనసేన శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఇక ఎన్నికల్లో పవన్ సపోర్టు ఇచ్చిన టీడీపీ కూటమి కూడా 160కు పైగా స్థానాల్లో ఆధిక్యంతో దూసుకెళుతోంది. ఈ నేపథ్యంలో జనసేన పవన్ కల్యాణ్, కూటమికి సపోర్టు చేస్తూ సినీ ఇండస్ట్రీకి చెందిన పలువురు ప్రముఖులు ట్వీట్ చేస్తున్నారు. తాజాగా జనసేన అధిపతి పవన్ కల్యాణకు మద్దతుగా ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ ట్వీట్ చేశారు. పవన్ తో తాను తెరకెక్కిస్తోన్న 'ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా'లోని 'గాజు పగిలే కొద్దీ పదునెక్కుద్ది' అని పవర్ స్టార్ చెప్పిన డైలాగ్ వీడియోను షేర్ చేశారు. ప్రస్తుతం హరీశ్ శంకర్ చేసిన ట్వీట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. వీరితో పాటు పలువురు టాలీవుడ్ హీరోలు, నటీనటులు, టెక్నీషియన్లు పవన్ కు ముందస్తుగా అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సాయి ధరమ్ తేజ్ కూడా పవన్ ఆధిక్యంపై స్పందించారు. 'పవర్ స్ట్రోమ్.. ప్రస్తుతం, అలాగే రాబోయే రోజుల్లో పవన్ కల్యాణ్ చేతిలో ఆంధ్ర ప్రదేశ్ సేఫ్ గా ఉంటుందని ట్వీట్ చేశారు.

# ఆంధ్రాలో కూటమి సునామి, తెలంగాణలో కూటమి నాయకులు విజయోత్సవ సంబరాలు

**ఏన్కూర్ జూన్ 4:** ఆంధ్ర ప్రదేశ్ లో మంగళవారం వెలువడిన ఎన్నికల ఫలితాలలో కూటమి అభ్యర్థులు సునామీ సృష్టించారు. తెలంగాణలో కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు మండల పరిధిలోని రాయమాదారం గ్రామం నుండి ఏన్కూర్ ప్రధాన రహదారులు వెంట భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం బిజెపి తెలుగుదేశం జనసేన నాయకులు ప్రధాన సెంటర్ లో బాణాసంచా పేల్చి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోవూరు నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కొనకంచి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు బొగ్గారపు శివకృష్ణ మరియు మండల నాయకులు స్థానిక ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, మాజీ జెడ్పిటిసి సభ్యురాలు కోపేల శ్యామల, తెలుగుదేశం పార్టీ వైరా నియోజకవర్గ నాయకులు ఆరెంరామయ్య, తాళ్లూరి అప్పారావు వేముల రమేష్ బాబు, కోపేల రామారావు, జాస్తి జనార్ధన్, తోట గిరిజ, జాగర్లమూడి సురేష్, సాయిలి నాగయ్య మాదినేని అశోక్ ఎరువ నవీన్ పసుపులేటి కిట్టు పాలెపు పాపారావు గిద్ద గిరి విజయ్ కొవ్వూరి మహేష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.






గరుడ వార్త



## ఎన్డీఏ కూటమికి తొలి విజయం..

### – కాంగ్రెస్ అభ్యర్థి పై అమిత్ షా 3,96,512 ఓట్ల తేడాతో విజయం

**గాంధీనగర్:** ఎన్డీఏ కూటమికి తొలి విజయం దక్కింది. గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి పోటీచేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా గెలుపొందారు. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి సోనాల్ రమణ్‌భాయ్‌పై 3,96,512 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో అమిత్ షాకు 5,06,731 ఓట్లు రాగా, రమణ్‌భాయ్‌కి 1,10,219 ఓట్లు పోలయ్యాయి. ఇక బహుజన్ సమాజ్‌వాదీ పార్టీకి చెందిన మహమ్మద్ అనీశ్ దేశాయ్‌కి డిపాజిట్ దక్కలేదు. ఆయనకు 3,244 ఓట్లు మాత్రమే వచ్చాయి.కాగా, కేంద్రంలో ఎన్డీయే మరోసారి ప్రభుత్వ ఏర్పాటు దిశగా కొనసాగుతున్నది. ఇప్పటివరకు 297 చోట్ల ఎన్డీఏ కూటమి ఆధిక్యంలో కొనసాగుతుండగా, ఇండియా బ్లాక్ 225 స్థానాల్లో మెజార్టీలో ఉన్నది. ఇప్పటివరకు ఇరు కూటములు ఒక్కో చోట విజయం సాధించారు. మరో 19 సీట్లలో ఇతరులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

======================

## ఎదురుదెబ్బలే పునరాగమనంగా.. తప్పులే పాఠాలుగా - ఫలితాలపై రోజా రియాక్షన్

**నగరి:** ఏపీలో ఎన్నికల కౌంటింగ్ కొనసాగుతోంది. ఎన్నికల ఫలితాల్లో తొలి రౌండ్ నుంచి టీడీపీ–జనసేన కూటమి తన చాటులోంది. సినీ నటి, నగరి అభ్యర్థి ఆర్కే రోజా సెల్వమణి నగరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వెనుకంజలో కొనసాగుతున్నారు.రోజాపై నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాశ్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఓటమి దిశగా పయనిస్తుండటంతో ఫలితాలపై ఆర్కే రోజా ఎక్స్ వేదికగా తన స్పందనను అందరితో షేర్ చేసుకున్నారు. శక్తివంతమైన వ్యక్తి అంటే భయాలే విశ్వాసంగా .. ఎదురుదెబ్బలే పునరాగమనంగా.. మన్నింపులే నిర్ణయాలుగా, తప్పులే పాఠాలుగా నేర్చుకునే వ్యక్తి.. అనే సందేశాన్ని జోడిస్తూ.. ఓ చిన్నారి నుంచి రోజా పువ్వును స్వీకరిస్తున్న సందర్భంలో తీసిన ఫొటోను షేర్ చేశారు. ఇప్పుడీ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.రాష్ట్రవ్యాప్తంగా కూటమిలో 135 (టీడీపీ) స్థానాల్లో, జనసేన 20 స్థానాల్లో లీడింగ్‌లో కొనసాగుతోంది. ఇక వైఎస్సార్సీపీ నుంచి పోటీలో ఉన్న మాజీ మంత్రులంతా వెనుకంజలో కొనసాగుతున్నారు.

===============

## ఏపీలో తొలి విజయం?..గోరంట్ల గెలుపు

**రాజమహేంద్రవరం:** రాజమహేంద్రవరం గ్రామీణం అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైంది. తెదేపా అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి 50 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. సమీప ప్రత్యర్థి, వైకాపా అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణపై ఆయన విజయం సాధించారు. రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ అయనకు ఎమ్మెల్యే గా ధృవపత్రం అందచేసారు.

===================

## ప్రతిపక్ష హోదా కోల్పోయిన వైసీపీ

**విజయవాడ:** ఏపీలో ఎన్నికల ఫలితాలు అధికార వైసిపికి చుక్కలు చూపిస్తున్నాయి. గత ఎన్నికల్లో 151 సీట్లు సాధించి.. సరికొత్త రికార్డు సృష్టించిన.. ఈసారి ఆ ఘనతను కొనసాగించలేకపోయింది.. ఐదేళ్లపాటు పరిపాలించినప్పటికీ.. ఏపీ ప్రజలు ఆ పరిపాలన పట్ల విసుగు చెంది టిడిపి కూటమికి అధికారాన్ని కట్టబెట్టారు. జగన్ పరిపాలనకు చరమగీతం పాడుతూ.. టిడిపి ఆధ్వర్యంలోని కూటమికి ఘన విజయం దిశగా తీర్పు ఇచ్చారు.. ఉదయం కౌంటింగ్ ప్రక్రియ మొదలైన నాటి నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఏ దశలోనూ వైసిపి అభ్యర్థులు కనీసం పోటీ ఇవ్వలేకపోయారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో పోరు హోరాహోరీగా సాగుతుందని అందరూ అంచనా వేశారు. కానీ ఓట్ల లెక్కింపులో ఆ దృశ్యం కనిపించలేదు.. వార్ వన్ సైడ్ అన్నట్టుగా కూటమి అభ్యర్థులు దుమ్ము లేపారు. 175 అసెంబ్లీ స్థానాలు ఉన్న ఏపీలో.. దాదాపు 90 శాతం నియోజకవర్గాలలో అదరగొట్టారు. ఇప్పటివరకు లెక్కించిన అన్ని రౌండ్లలోనూ వైసీపీ అభ్యర్థులు దారుణంగా వెనుకబడ్డారు. ప్రజా తీర్పు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో.. పలుచోట్ల కౌంటింగ్ కేంద్రాల నుంచి వైసీపీ అభ్యర్థులు ఇంటి ముఖం పడుతున్నారు.. ఇలా ఇంటి ముఖం పట్టిన వారిలో గుడివాడ అభ్యర్థి కొడాలి నాని, గన్నవరం అభ్యర్థి వల్లభనేని వంశీ ఉన్నారుఫలితాల సరళి పూర్తి ఏకపక్షంగా ఉండడంతో.. వైసిపికి కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కుతుందా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఏపీ అసెంబ్లీ స్థానాల ప్రకారం ప్రతిపక్ష హోదా సాధించాలంటే కనీసం 18 మంది ఎమ్మెల్యేలను వైసిపి గెలుపొందాలి. అయితే ఇప్పటివరకు వెల్లడైన ఫలితాలలో.. 18కి లోపు స్థానాలలో వైసిపి లీడ్ లో కొనసాగుతోంది. వైసిపి కంటే సొంతంగానే జనసేన 20 స్థానాలలో ఆధిక్యంలో ఉంది. జనం తీర్పు స్పష్టంగా కనిపిస్తున్న నేపథ్యంలో వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కుతుందా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఒకవేళ ఇదే ట్రెండ్ కొనసాగితే వైసీపీ 14 స్థానాలకు మాత్రవే పరిమితం అవుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.ఇప్పటికే చాలామంది మంత్రులు ఓటమి బాట పట్టారు. ధర్మాన ప్రసాదరావు నుంచి మొదలు పెడితే అప్పలరాజు వరకు అందరూ ఓటమి అంచులో నిలిచారు. బొత్స సత్యనారాయణ వంటి వారు మొదట్లో కాస్త ముందంజలో ఉన్నప్పటికీ.. ఆ తర్వాత రౌండ్లలో ఆ దూకుడు కొనసాగించలేకపోయారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమే ప్రస్తుతం పులివెందుల అసెంబ్లీ స్థానం నుంచి ముందంజలో ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ 151 స్థానాలకు గెలుచుకోగా.. టిడిపి 23 స్థానాలకు పరిమితమైంది. ఈసారి ఎన్నికల్లో వైసిపి గతంలో టిడిపి గెలుచుకున్న స్థాయిలో స్థానాలను దక్కించుకోలేకపోతుందనే వార్తలు వినిపిస్తున్నాయి.

===================

## మంత్రులంతా ఓటమి పాలు

**విజయవాడ :** ఏపీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో దాదాపు మత్రులుగా పనిచేసిన వైకాపా అభ్యర్థులంతా ఓటమి దిశగా పయనిస్తున్నారు. ఇప్పటి వరకూ వెలువడిన ఓట్ల లెక్కింపు గణాంకాల్లో ఈ మంత్రులంతా వెనుకంజలో ఉండటం కనిపిస్తోంది.ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి వేవ్ స్పష్టంగా కనిపిస్తోంది. ఎగ్జిట్ పోల్స్ ని మించి కూటమి అభ్యర్థులు లీడ్ లో ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ పంథా కొనసాగితే ఈఎన్నికల్లో గత ఎన్నికల్లో వైకాపా సాధించిన 151 స్థానాల మార్క్ ను కూటమి దాటేసేలా కనిపిస్తోంది. ముఖ్యంగా మంత్రుల ఇలాఖాలో ప్రతికూల ఫలితాలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. పులివెందులలో సీఎం జగన్, చీపురు పల్లిలో బొత్స సత్యనారాయణ, పుంగనూరులో పెద్దిరె?డ్డి రామచంద్రారెడ్డి, సర్వేపల్లిలో కాకాణి గోవర్ధన్ రెడ్డి మినహా మంత్రులంతా ఓట్ల లెక్కింపులో భారీగా వెనకబడ్డారు. కాకాణి, బొత్స, పెద్దిరెడ్డి సైతం కొన్ని రౌండ్లలో స్వల్ప తేడాతో వెనకంజ వేయడం కనిపిస్తోంది.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతోనే బాల్యానికి స్వేచ్ఛ



ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలవద్ద బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్ళు, ఇళ్ళల్లో వెట్టి చాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయ పెట్టీ, హింసించి, మోసగించి, బెదిరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హెూటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పను లకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ – ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది.1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేవడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

# వాతావరణ సంక్షోభం

వాతావరణ మార్పు, పర్యావరణ పరిరక్షణ కోసం భారతదేశం స్పష్టమైన రోడ్ మ్యాప్‌తో 21వ శతాబ్దిలోకి పయనిస్తోంది' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గత ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5) సందర్భంగా ఇచ్చిన సందేశంలో తెలిపారు. 'నేడు భారత దేశం పర్యావరణం, ఆర్థిక వ్యవస్థల మధ్య సంపూర్ణ సంతులనం ఏ విధంగా సాధించాలో అన్న విషయంలో ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచింది' అంటూ గత డిసెంబర్‌లో కాప్ సదస్సులో ప్రసంగిస్తూ చెప్పారు. ఈ విధంగా జాతీయ, అంతర్జాతీయ వేదికల నుండి మన ప్రధాని పర్యావరణ కార్యాచరణలో భారత్ పాత్ర గురించి ఎన్నో గంభీరమైన ప్రసంగాలు చేస్తూ వచ్చారు. అయితే, 2022 ప్రపంచ పర్యావరణ పనితీరు సూచికలో 180 దేశాలలో 180వ స్థానంలో ఉన్నామంటే ఎటువంటి దుర్బలమైన పరిస్థితుల్లో ఉన్నా మో అర్థం అవుతుంది. ఆయన ప్రసంగాలలో నెలకొన్న గాంభీర్యం బడ్జెట్ కేటాయింపులలో, కార్యాచరణలో కనిపించకపోవడమే అందుకు ప్రధాన కారణమని గమనించాలి. చరిత్రలో ఎరుగని భారీ ఉష్ణోగ్రతలను ఢిల్లీ, నాగపూర్ వంటి నగరాలు ప్రస్తుతం చవిచూస్తున్నాయి. పర్వతాలలో అతి పిన్న వయస్సుగల హిమాలయ పర్వతాలు విచ్చలవిడి అభివృద్ధి నమూనాల కారణంగా గతించిపోతున్నాయి. సిక్కిం, ఉత్తరాఖండ్‌లలో సంభవిస్తున్న భారీ వర్షాలతో పలు ప్రాంతాలు కొట్టుకుపోవడం గమనిస్తుంటే పర్యావరణంపై ఎటువంటి విష ప్రభావం చూపుతుందో అర్థం అవుతుంది. పర్యాటక రంగానికి ప్రాధాన్యత పేరుతో హిమాలయాల విధ్వంసానికి పూనుకొంటున్నామనే ఆందోళన కలుగుతుంది. మరోవంక సులభతర వ్యాపారంలో భారత దేశం 2014లో 142వ రాంక్‌లో ఉంటే, ప్రపంచ బ్యాంకు ఈ రాంక్‌లు ఇవ్వడం ఆపివేసిన 2019లో 63వ రాంక్‌కు చేరుకున్నాము. కానీ పర్యావరణంలో మాత్రం 2012లో 125వ రాంక్ లో ఉంటే 2022 నాటికి 180వ రాంక్‌కు దిగజారిపోయాము. తాజాగా పర్యావరణ పత్రిక డౌన్‌తో ఎర్త్‌తో కలిసి సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్ఇ)విడుదల చేసిన వార్షిక గణాంకాలు సైతం పర్యావరణ విధ్వంసం ఫలితంగా ఎంతగా దిగజారిపోతున్నామో వెల్లడి చేస్తున్నాయి.

మరో వారం రోజులలో దేశంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాబోతున్న సమయంలో కఠిన వాస్తవాలతో కూడిన ఈ గణాంకాలు వారికి ఓ విధంగా కనువిప్పు కాగలవని ఆశిద్దాము. ఈ నివేదిక వెల్లడించిన గణాంకాలు భయంకరమైన చిత్రాన్ని చిత్రించాయి.కానీ అందులో ఒక అవకాశం దాపురించింది. ఈ నివేదిక కొత్త పాలన ప్రాధాన్యతలను వివరిస్తుంది. –ఈ రోజు మనం ఎదుర్కొంటున్న వాతావరణ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని మన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాల్సిన రంగాలను సూచిస్తుంది' అని సిఎస్ఇ డైరెక్టర్ జనరల్ సునీతా నారాయణ్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ లక్ష్యాలను చేరుకోవడానికి సంసిద్ధతకు సంబంధించి 166 దేశాలలో భారతదేశం 112వ స్థానంలో ఉంది. భారత దేశ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి (హైడ్రోతో సహా) వాస్తవానికి 2022–23, 2023–24 మధ్య 1.5% తగ్గింది. 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఉత్పత్తిపడిపోయింది. తలసరి ఆరోగ్య వ్యయం కూడా తగ్గుతోంది. 12 రాష్ట్రాలు జాతీయ సగటు కంటే దిగువన ఉన్నాయి. జాతీయ పంటల బీమా పథకం కింద బీమా చేయబడిన ప్రాంతం 2022–23లో పథకం ప్రారంభించినప్పటితో పోలిస్తే 12 శాతం తగ్గింది. అనేక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తక్కువ తలసరి ఆరోగ్య వ్యయం, అధిక సంక్రమించని వ్యాధుల సంభవం, పునరుత్పాదక శక్తి ఉత్పత్తి క్షీణించడం, సరిపోని పంట బీమా కవరేజీతో పోరాడుతున్నాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నట్లు డౌన్ టు ఎర్త్ మేనేజింగ్ ఎడిటర్ రిచర్డ్ మహాపాత్ర తెలిపారు. 26 రాష్ట్రాలు/ యుటిలలో మొత్తం మరణాలలో 50% నాన్–కమ్యూనికేబుల్ డిసీజెస్. ఢిల్లీ, గోవా, కేరళ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, తెలంగాణ, దేశంలోని ఈశాన్య ప్రాంతాల్లోని చాలా రాష్ట్రాలు ఉన్నాయి. 23 రాష్ట్రాలు / యుటిలు గ్రామీణ గృహాలలో 100 శాతం కుళాయి నీటి కనెక్షన్‌లను సాధించలేదు. పశ్చిమ బెంగాల్ వెనుకబడిన రాష్ట్రాలలో ఒకటిగా అవతరించింది. తొమ్మిది రాష్ట్రాలు/ యుటిలలో వాయు కాలుష్య స్థాయిలు చాలా ఎక్కువగా ఉన్నా యి. నిర్దుష్టమైన ప్రణాళిక లేకుండా విశృంఖలంగా జాతీయ రహదారుల విస్తరణ చేపడుతూ ఉండడంతో వ్యవసాయ భూములు తగ్గిపోతున్నాయి. ఎప్పుడూ నాలుగేళ్లకు సరిపడే ఆహార ధాన్యాలు నిల్వఉండే దేశంలో ఇప్పుడు ఒక ఏడాది పంటల ఉత్పత్తి తగ్గితే ఆహార కొరతే అనే భయం వెంటాడుతున్నది. దేశం ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారే ఆందోళన వ్యక్తం అవుతుంది. తలసరి విద్యుత్ లభ్యత పరంగా, 16 రాష్ట్రాలు/ యుటిలు జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళ, జార?ండ్, అసోం, బీహార్ వంటి పెద్ద రాష్ట్రాలు ఈ జాబితాలో ఉన్నాయి. 2023లో భారతదేశం అత్యంత వేడి వాతావరణం చూసింది. దేశంలోని 36 రాస్త్రాలు/ యుటిలు ఉంటే 26 రాష్ట్రాలలోని 102 వాతావరణ స్టేషన్లు రికార్డ్ బ్రేకింగ్ ఉష్ణోగ్రతలను చూశాయి. అదే సమయంలో 23 రాష్ట్రాలు/ యుటిలలో 69 వాతావరణ స్టేషన్లు రికార్డు స్థాయిలో వర్షపాతాన్ని నమోదు చేశాయి. జనవరి 1 నుండి డిసెంబర్ 31, 2023 మధ్య, భారత దేశం 365 రోజులలో 318 రోజులలో తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొందని నివేదిక పేర్కొంది. ఈ సంఘటనలు 3,287 మంది ప్రాణాలను బలిగొన్నాయి. 2.2 మిలియన్ హెక్టార్ల పంట విస్తీర్ణాన్ని నాశనం చేశాయి. 2023 మొదటి మూడు నెలల్లో, మెరుపులు, తుఫానులు అత్యంత తరచుగా సంభవించే తీవ్రమైన వాతావరణ సంఘటనలుగా ఉన్నాయి. ప్రపంచంలో అత్యంత విపత్తు ప్రభావ దేశాలలో భారతదేశం 20వ దేశంగా ఉన్నట్లు ఈ నివేదిక పరిశోధకురాలలో ఒకరైన కిరణ్ పాండే తెలిపారు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల పరంగా, భారత దేశపు వాటా 1994 నుండి 2019 మధ్య 115 శాతం పెరిగిందని తెలిపారు. 2019 లో దేశం 2,647 మిలియన్ టన్నుల కార్బన్‌డయాక్సైడ్‌ను విడుదల చేసింది.

ఇంధన పరిశ్రమ అతిపెద్ద ఉద్గారిణి. 2019లో మొత్తం జాతీయ కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల్లో 76% వాటాను కలిగి ఉంది. నీటి కొరత, నీటి కాలుష్యం, నగరాల్లో వాయు కాలుష్యం, క్షీణిస్తున్న ప్రజా రవాణా మొదలైనవి పర్యావరణ సమతుల్యం భారత దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలు. వీటికి కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వం తగు ప్రాధాన్యతలు ఇవ్వగలదని ఆశిద్దాము. వాతావరణ మార్పుల సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరాన్ని పాలకులు గుర్తించాలి. వాతావరణ మార్పుకు తగు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే అభివృద్ధి, జీవనోపాధి, అందరికీ శ్రేయస్సు సాధ్యం కాగలదని గమనించాలి. విశృంఖలంగా భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదాలు తెల్పడం, పర్యావరణ, అటవీ, తీరప్రాంతాలు, వన్యప్రాణులు, జీవారణ్యం, గనులు, ఇతర సహజ వనరుల కు సంబంధించిన చట్టాలను బలహీనపరచడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి ప్రభుత్వం దోహదపడతున్నది. ప్రకాష్ జవదేకర్, ప్రస్తుతం భూపేంద్ర యాదవ్ పర్యావరణ మంత్రులుగా విచ్చలవిడిగా పర్యావరణ అనుమతులు ఇస్తూ ఉండడంతో పర్యావరణ విధ్వంసంపై మార్గం ఏర్పర్చినట్లు అవుతున్నది. కేంద్రంలోని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ 2018లో 577 పర్యావరణ, అటవీ, వన్యప్రాణ, తీరప్రాంత అనుమతులు మంజూరు చేస్తే, వాటి సంఖ్య 2022లో 21 రేట్లు పెరిగి 12,499 అనుమతులు ఇచ్చారు.

అభివృద్ధి పేరుతో ప్రభుత్వం పర్యావరణ విధ్వసంకు ఏ విధంగా దోహదపడుతుందో ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ అనుమతులకు 2018లో సగటున 150 రోజుల వ్యవధి పడితే, ఆ వ్యవధిని 2022లో 70 రోజులకు తగ్గించడం గమనార్హం. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్, 2016కు 2018 నుండి 2023 మధ్య 100కు పైగా సవరణలు చేశారు. అంటే పర్యావరణ అనుమతులు ఇవ్వడంలో పర్యావరణ ప్రభావం గురించి అవసరమైన అంచనా వేయడంలో ప్రభుత్వం ఎంతో తొందరపాటుతో వ్యవహరిస్తున్నట్లు భావించాల్సి వస్తుంది. చాలా సవరణలను 'ప్రజా ప్రయోజనం' పేరుతో ప్రజల మద్దతు అవసరం లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేకుండా చేస్తుండటం జరుగుతుంది. భారీ ప్రాజెక్టుల విషయంలో ప్రభావానికి గురయ్యే ప్రజల అభిప్రాయాలు సేకరించడం పట్ల ఎగవేత ధోరణి కనిపిస్తుంది. కనీసం వారి పునరావాసం, పరిహారం వంటి విషయాలలో సైతం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. అభివృద్ధి అంటే ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధిగా పరిగణిస్తున్నారు.

మానవ, స్థిరమైన అభివృద్ధి గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అందుకనే నేడు మనం అనుసరిస్తున్న అభివృద్ధి నమూనా పర్యావరణ విధ్వంసాన్ని వేగవంతం కావిస్తున్నది. 2014 బిజెపి ఎన్నికల ప్రణాళికలో 'అటవీ ప్రజల ప్రయోజనాలు కాపాడి, మెరుగుపరచడానికి కృషిచేస్తాం' అని పేర్కొన్నది. అయితే, 2023లో అటవీ పరిరక్షణ చట్టం, 1980కు తీసుకొచ్చిన సవరణల ఫలితంగా 'అటవీ ప్రాంతం' నిర్వచనాన్ని కుదించే ప్రయత్నం జరిగింది. దానితో సుమారు నాల్గవవంతు అటవీ ప్రాంతం పట్టణీకరణ, గనుల తవ్వకం, అభివృద్ధి ప్రోజెక్టుల పేరుతో ఉనికి కోల్పోయే ప్రమాదంలో చిక్కుకొని పరిస్థితి ఏర్పడింది. అటువంటి అనుమతులు ఇచ్చే సమయంలో ముందుగా అటవీ ప్రజలు, అక్కడి నివాసితులతో ముందుగా సంప్రదించాలని చట్టబద్ధ ప్రక్రియకు తిలోదకాలిచ్చే ప్రయత్నం జరుగుతున్నది.



# ఇజ్రాయెల్ పౌరులపై మాల్దీవులు నిషేధం



ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో పాలస్తీనాకు మాల్దీవుల ప్రభుత్వం మద్దతు ఇచ్చింది. ఇజ్రాయెల్ పౌరులు మాల్దీవులలోని ప్రవేశించకుండా నిషేధం విధించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. దేశంలో పాస్‌పోర్ట్ నిబంధనలు మార్చడం ద్వారా ఇజ్రాయెల్ పాస్‌పోర్ట్‌లను నిషేధించనున్నట్లు పేర్కొంది. అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేబినెట్ ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో దేశంలోని సీనియర్ అధికారులు ఉన్నారు. అంతేగాక పాలస్తీనా అవసరాలను గుర్తించడానికి ప్రత్యేక రాయబారిని కూడా నియమించింది. పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్యసమితి రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ సహాయంతో పాలస్తీనా పౌరులకు సహాయం చేయడానికి నిధుల సేకరణ ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. పాలస్తీనా పౌరులకు మద్దతు తెలిపేందుకు 'మాల్దీవియన్స్ ఇన్ సోలిడారిటీ విత్ పాలస్తీన్' అనే నినాదంతో దేశ వ్యాప్త ర్యాలీని కూడా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. కేబినెట్ మీటింగ్ తర్వాత దేశ హోంల్యాండ్ సెక్యూరిటీ, టెక్నాలజీ మంత్రి అలీ ఇహుసన్ ఈ నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించారు. కాగా, గాజాలో ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా మాల్దీవులలో ప్రజలు నిరసనలు చేస్తున్నారు. రఫా నగరంలో దాడులను ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఇజ్రాయెల్ పౌరుల ప్రవేశాన్ని కూడా నిషేధించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏటా సుమారు 15వేల మంది ఇజ్రాయెల్ పౌరులు మాల్దీవులను సందర్శిస్తారని తెలుస్తోంది.

## విజయవంతమైన ఎన్నికల నిర్వహణ...!

వైవిధ్యభరితం నా సువిశాల భారతం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 83 ప్రకారం ప్రతి ఐదేళ్లు ఒకసారు లోకసభ సాధారణ ఎన్నికలు జరగాలి. నేడు ప్రభుత్వంలో ఉన్న నరేంద్ర మోదీ నాయకత్వ 17వ లోకసభ గడువు 16 జూన్ 2024న ముగియనుంది. భారతీయులు పర్వదినాలుగా భావించబడుతున్న సాధారణ ఎన్నికలు - 2024 జరుగుతున్న వేళలు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యానికి పుట్టం కదుతున్న కాలం. భారత లోకసభకు 543 మంది ఎంపీలను ఎన్నిక చేయడంలో 19 ఏప్రిల్ నుంచి 01 జూన్ 2024 వరకు ఏడు దఫాలుగా జరిగిన సాధారణ ఎన్నికల ఫలితాలు 04 జూన్ 2024న వెలువడి 18 లోకసభ ఏర్పడనుంది. ఈ సాధారణ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలో దాదాపు 40 పార్టీల ఎన్‌డిఏ కూటమి, కాంగ్రేస్ నేతృత్వంలో 26 పార్టీల ఇండియా కూటమి ప్రధానంగా పోటీ పడినప్పటికీ 6 జాతీయ పార్టీలతో పాటు 57 రాష్ట్ర పార్టీలు, 2,764 అధికార గుర్తింపులేని పార్టీలు ఎన్నికల్లో పాల్గొన్నాయి. భారత్‌లో ఎన్నికలను నిర్వహించడానికి స్వయంప్రతిపత్తి కలిగిన భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) నడుం బిగిస్తుంది. 2024 సాధారణ ఎన్నికల్లో దాదాపు 70 శాతం భారత జనాభా, అనగా 18 ఏండ్ల వయస్సు దాటిన 96.8 కోట్ల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అర్హతను కలిగి ఉన్నారు. 2019లో నిర్వహించిన ఎన్నికలతో పోల్చితే నేడు 15 కోట్ల మంది ఓటర్లు అదనంగా ఓటు వేయనున్నారు. ఈ సాధారణ ఎన్నికలతో పాటు ఏపీ, అరుణాచల్, ఒడిసా, సిక్కిమ్ రాష్ట్రాల శాసన సభలకు, 25 ఎంఎల్ఏ స్థానాలకు ఉప ఎన్నికలు కూడా ఎన్నికలు జరుతున్న సందర్భం. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి 2 కిమీ లోపు పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి. ఈ నిబంధన ప్రకారం ఒకే ఓటరు ఉన్న అరుణాచల్ మలోగామ్, ఒకే గుడి పూజారి ఓటరు ఉన్న గుజరాత్ గిర్ ఫారెస్టుల్లో కూడాపోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. అదే విధంగా కేరళ వన్యప్రాణ అభయారణ్యం, గుజరాత్‌లోకి షిప్పింగ్ కంటేనర్, మణిపూర్ అల్లరులలో స్థానభ్రంశం చెందిన 59,000 మందికి చెందిన 320 శరణార్థుల శిబిరాల్లో కూడా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసింది భారత ఎన్నికల కమీషన్. ఈ ఎన్నికల్లో దాదాపు 5.5 మిలియన్ల ఓటింగ్ మిషన్లు, ఒక మిలియన్ పోలింగ్ స్టేషన్లు, 15 మిలియన్ల ఎన్నికల సిబ్బంది ఈ సాధారణ ఎన్నికల యజ్ఞంలో పని చేసారు. ఈ ఎన్నికల్లో 85 ఏండ్లు దాటిన వృద్ధులు, అంగవైకల్య ఓటర్లకు తమ ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కూడా కల్పించారు. భారత ప్రభుత్వ సాధారణ ఎన్నికలు 19 ఏప్రిల్ నుంచి 01 జూన్ 2024 వరకు 7 దఫాలుగా నిర్వహించబడ్డాయి. తొలి దఫా 19 ఏప్రిల్‌న 101.5 స్థానాలకు, 2వ ఫేజ్ 26 ఏప్రిల్‌న 87.5 స్థానాలకు, 3వ ఫేజ్ 07 మేన 94 స్థానాలకు, 4వ ఫేజ్ 13 మేన 96 స్థానాలకు, 5వ ఫేజ్ 20 మేన 49 స్థానాలకు, 6వ ఫేజ్ 25 మేన 58 స్థానాలకు, 7వ చివరి ఫేజ్ 01 జూన్ 2024న 57 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ సాధారణ ఎన్నికల్లో అత్యధికంగా 441 స్థానాలకు భాజపా, 285 స్థానాలకు కాంగ్రేస్, 62 స్థానాలకు సమాజ్‌వాదీ, 47 స్థానాలకు సిపిఎం, 47 స్థానాలకు తృణముల్ కాంగ్రేస్ పార్టీలు ప్రధానంగా ఎన్నికల క్షేత్రంలో తమ అదృష్టాలను, ఆదరణను పరిక్షించుకోనున్నాయి. గత దశాబ్ద కాలంగా భాజపా నేతృత్వ ఎన్‌డిఏ ప్రభుత్వం దాదాపు 300 సంక్షేమ పథకాలతో 90 కోట్ల జనాలకు రూ 34 ట్రిలియన్లు వెచ్చించడా చూసాం. ఇంత జరిగినా నిరుద్యోగం రికార్డు స్థాయిలో 23.2 శాతం వరకు పెరిగింది. ముఖ్యంగా గ్రాడ్యుయేట్‌లలో నిరుద్యోగం 42.3 శాతంగా నమోదు అయ్యింది. ఫిబ్రవరి 2024లో సుప్రీంకోర్టు ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో పార్టీలు నిధులను సమీకరించడాన్ని రద్దు చేసింది. దేశంలో భాజపా రూ 6,060 కోట్లు, తృణముల్ రూ 1,609 కోట్లు, కాంగ్రేస్ రూ 1,412 కోట్లు, బిఆర్ఎస్ రూ 1,215 కోట్లు, బిజెడీ రూ 776 కోట్లను బాండ్స్ రూపంలో పొందడం జరిగింది. 'అబ్‌కీ బార్ 400 పార్' అనే నినాదంతో భాజపా మోదీ నేతృత్వంలో 'మోదీ కీ గ్యారంటీ' అంటూ ఈ ఎన్నికల్లో విస్తృత ప్రచారం చేసింది. నారీ శక్తి, లక్‌పతి దీదీ, ఉచిత రేషన్, మత్తుత్తు ధరలు పెంచడం, ఉచిత విద్యుత్తు, 3 కోట్ల గృహాల నిర్మాణం, వన్ నేషన్ వన్ ఎలక్షన్, యూనిఫాం సివిల్ కోడ్, 5 ట్రిలియన్ల ఎకానమీకి చేరడం, యూఎన్ భద్రతా మండలిలో సభ్యత్వం లాంటి పార్టీ మానిఫెస్టోతో భాజపా ఎన్నికల కదన రంగంలోకి దూకింది. భారత్ జోడో న్యాయ యాత్రతో జనవరి 2024లో రాహుల్ గాంధీ కాంగ్రేస్ ప్రచారానికి తెర లేపారు. ఏడాదికి 30 లక్షల యువతకు ఉ ద్యోగాల కల్పన, పేద మహిళలకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం, మద్దత్తు ధరను చట్టబద్ధమైన చేయడం, పేదలకు ఉచిత వైద్యం, కులగణన చేపట్టడం లాంటి ఎన్నికల హామీలతో 'న్యాయ పత్ర' విడుదల చేసి ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించారు. ఒపినియన్ పోల్స్ అంచనాల ప్రకారం ఎన్నికల ఫలితాలు ఎన్‌డిఏ పక్షాలకు మెజారిటీ స్థానాలు కనిష్టంగా 306 నుంచి గరిష్టంగా 411 వరకు రావచ్చని తెలిపారు. తొలి ఫేజ్‌లో 66.14 శాతం, 2వ ఫేజ్‌లో 66.71 శాతం, 3వ ఫేజ్‌లో 65.68 శాతం, 4వ ఫేజ్‌లో 69.16 శాతం, 5వ ఫేజ్‌లో 62.20 శాతం, 6వ ఫేజ్‌లో 63.36 శాతం, 7వ ఫేజ్‌లో 61.23 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడు దఫాలుగా జరిగిన ఈ సాధారణ ఎన్నికల్లో దాదాపు 65 శాతం వరకు, అనగా దాదాపు 63 కోట్ల భారత ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అర్థం అవుతున్నది.తాజాగా విడుదలైన పలు ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం 350 సీట్ల వరకు నెగ్గి మోదీ నేతృత్వంలో తీన్మార్ అంటూ ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడనున్నట్లు స్పష్టం అవుతున్నది. ఈ సాధారణ ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల్లో భాజపా తన ఆదరణను పెంచుకోవడం ఖాయంగా తోస్తున్నది.


## యూఎన్‌లో భారత శాశ్వత ప్రతినిధి...




**- రుచిరా కాంబోజ్ పదవీ విరమణ**

ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ శనివారం పదవీవిరమణ పొందారు. దాదాపు 35 ఏళ్ల పాటు దౌత్యవేత్తగా ఆమె సేవలందించారు. యూఎన్ లో భారత శాశ్వత ప్రతినిధిగా పనిచేసిన తొలి మహిళగా ఆమె నిలిచారు. 1987 బ్యాచ్ అధికారి అయిన రుచిరా.. పలు దేశాల్లో భారత దౌత్యవేత్తగా పనిచేశారు. రిటైర్ మెంట్ తర్వాత రుచిరా స్పందిస్తూ.. అసాధారణమైన సంవత్సరాలు, మరుపురాని జ్ఞాపకాలు ఇచ్చినందుకు.. థాంక్యూ భారత్ అని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రుచితా కాంబోజ్ 1987 సివిల్ సర్వీసెస్ బ్యాచ్‌లో ఆల్ ఇండియా మహిళా టాపర్. హిందీ, ఇంగ్లీష్, ఫ్రెంచ్ మాట్లాడే కాంబోజ్ 1989-91 వరకు ఫ్రాన్స్ లోని భారత రాయబార కార్యాలయంలో మూడో కార్యదర్శిగా పనిచేశారు. మారిషస్, దక్షిణాఫ్రికా, భూటాన్ సహా మరికొన్ని దేశాల్లో కూడా తన సేవలను అందించారు. 2002-2005 వరకు న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితికి భారత శాశ్వత మిషన్‌లో కౌన్సెలర్‌గా ఆమె నియామకం పొందారు. అక్కడ యూఎస్ శాంతి పరిరక్షణ, యూఎన్ భద్రతా మండలి సంస్కరణ, మధ్యప్రాచ్య సంక్షోభం తదితర అంశాలపై పనిచేశారు. 2011-2014 వరకు భారతదేశపు ప్రోటోకాల్ చీఫ్‌గా ఉన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వంలో ఈ పదవిని నిర్వహించిన ఏకైక మహిళ రుచిరానే. 2022 నుంచి ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత రాయబారిగా పనిచేశారు.


## నాకంటే నా కుటుంబానికే ఇది క్లిష్ట సమయం..!



తన భార్యపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్ కు సంబంధించిన సెక్స్ స్కాండల్ కేసులో దోషిగా తేలిన తర్వాత ఈ కామెంట్స్ చేశారు. చాలా రోజులుగా జరుగుతున్న నేరవిచారణ తనకంటే, తన భార్య మెలానియాపైనే ఎక్కువ ప్రభావం చూపించిందన్నారు. స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. విచారణ ఆఖరిరోజు తన పిల్లలు ముగ్గురు మాత్రమే కోర్టుకు హాజరయ్యారని పేర్కొన్నారు. ముగ్గురు పిల్లలు తనకు నైతిక మద్దతు ఇచ్చారని అన్నారు. కానీ, తన భార్య మెలానియా మాత్రం కోర్టుకు రాలేదన్నారు. తనను దోషిగా నిర్ధరించడాన్ని మెలానియా జీర్ణించుకోవడం కష్టమే అని అన్నారు. తనపై అభియోగాలు రుజువుకావడంతో తన కుటుంబసభ్యులపై అది తీవ్ర ప్రబావం చూపించిందన్నారు. తనకంటే ఎక్కువగా వారే బాధపడుతున్నారని అన్నారు. తాను దోషిగా తేలడం మెలానియాకు మింగుడు పడకపోయి ఉ ంటుందని.. అందుకే కోర్టుకు రాలేదేమో అని అన్నారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మెలానియా ఎల్లప్పుడూ ఆయన వెంటే ఉండేవారు. అధికార, ప్రైవేటు కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. అయితే, ట్రంప్ అధ్యక్ష పదవి కోల్పోయిన తర్వాత ఆయన చేపట్టిన ఏ ర్యాలీలోనూ ఆమె కనిపించలేదు. ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొనలేదు. ముగ్గురు పిల్లలు తనకు నైతిక మద్దతు ఇచ్చారని అన్నారు. కానీ, తన భార్య మెలానియా మాత్రం కోర్టుకు రాలేదన్నారు. తనను దోషిగా నిర్ధరించడాన్ని మెలానియా జీర్ణించుకోవడం కష్టమే అని అన్నారు. తనపై అభియోగాలు రుజువుకావడంతో తన కుటుంబసభ్యులపై అది తీవ్ర ప్రబావం చూపించిందన్నారు. తనకంటే ఎక్కువగా వారే బాధపడుతున్నారని అన్నారు.

## చంద్రుని అవతలి వైపుకు చేరుకున్న చాంగే-6 వ్యోమనౌక.......

చంద్రునికి అవతలి వైపు ఖనిజాలను అన్వేషించేందుకు మానవరహిత వ్యోమనౌకను పంపించగా అది ఆదివారం సురక్షితంగా ల్యాండ్ అయిందని చైనా అంతరిక్ష సంస్థ తెలిపింది. చాంగే-6 ల్యూనార్ లాండర్ చైనా అధికారిక సమయం ప్రకారం, ఆదివారం ఉదయం 6:23 గంటలకు చంద్రుడి వెనుక భాగంలో ఉన్న ఐట్‌కెన్ బేసిన్‌లో విజయవంతంగా దిగినట్లు చైనా నేషనల్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ తన వెబ్‌సైట్‌లో ఒక ప్రకటనలో తెలిపింది. మే 3న దీనిని ప్రయోగించగా దాదాపు 53 రోజుల పాటు ప్రయాణించి చంద్రున్ని చేరుకుంది. దీంతో అంతరిక్ష ప్రయోగాల్లో చైనా కీలక అడుగు వేసినట్లు అయింది. ల్యాండర్, అసెండర్‌తో కూడిన ఈ వ్యోమనౌక ఆ ప్రాంతంలో ఉండే రాళ్ళు, మట్టి నమూనాలను సేకరిస్తుంది. ఉపరితలంపై డ్రిల్ చేసి దాని రెండు కిలోల మట్టిని భూమి పైకి తీసుకు వస్తుంది. అలాగే, అక్కడికక్కడే మట్టి నమూనాలను శాస్త్రీయ విశ్లేషణ చేసి డేటాను తిరిగి పంపిస్తుంది. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి కానుంది. గతంలో 2019లో కూడా చైనా చాంగే-4 అనే వ్యోమనౌకను



చంద్రుని అవతలి వైపుకు పంపించింది. చైనా 2030 నాటికి చంద్రుడిపైకి మనుషులతో కూడిన మిషన్‌ను పంపాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే,చంద్రుని ఉపరితలంపై స్థావరాన్ని నిర్మించాలని యోచిస్తోంది. దీనిలో భాగంగా చైనా ఈ ప్రయోగాలు చేస్తుంది. చంద్రుడిపై ఈ ప్రాంతం గురించి ఇప్పటి వరకు ఎవరూ పరిశోధించలేదని, ఇక్కడికి వెళ్లేందుకు ఎవరూ ప్రయత్నించలేదని, దీనిని సాధించామని చైనా పేర్కొంది.

## సందేశ్ ఖాళీలో మరోసారి ఉద్రిక్తత..



పశ్చిమ బెంగాల్ లోని సందేశ్ ఖాళీలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల తర్వాత హింస చెలరేగింది. ఈ హింసపై బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాలని సీఎం మమతా బెనర్జీని కోరారు. ఈ విషయంపై మమతా బెనర్జీకి లేఖ రాశారు. శనివారం పోలింగ్ ముగిసిన కొన్నిగంటలకే మహిళలపై దాడులు జరిగినట్లు తెల్సిందని గవర్నర్ లేఖలో పేర్కొన్నారు.. ఇలాంటి దాడులు కొనసాగితే సహించేది లేదన్నారు. బాధిత మహిళల కోసం రాజ్ భవన్ తలుపులు తెరిచే ఉంటాయని పేర్కొన్నారు. రాజ్ భవన్ లో సురక్షితంగా ఆశ్రయం పొందవచ్చని అన్నారు. ఎన్నికలు ముగిసిన కొన్నిగంటలకే సందేశ్ ఖాలీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలింగ్ ముగిసిన తర్వాత అగర్హతి గ్రామంలో పోలీసులపై కొందరు దుండగులు దాడులు జరిపారు. అయితే, ఈకేసుకు సంబంధించి పలువురిని అదుపులోకి తీసుకునేందుకు అధికారులు అక్కడికి వెళ్లారు. అక్కడికి వెళ్లిన పోలీసులను స్థానిక మహిళలు అడ్డుకున్నారు. పోలీసులకు, మహిళలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు గ్రామంలోకి వెళ్లకుండా చెట్ల కొమ్మలను పడగొట్టి.. రహదారిని దిగ్బంధించారు.


## అస్సాంలో ఆగని వరదలు....

గౌహతి : అస్సాంలో వరదలు కొనసాగుతున్నాయి. వరదల కారణంగా మే 28 నుంచి ఆదివారం నాటికి 15 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. వరదల కారణంగా హైలాకండి హొజాయ్, మోరిగావ్, కరీంగంజ్, నాగావ్, కాచర్, దిబ్రూఘర్, గోలాఘట్, కర్బీ అంగ్లాంగ్ వెస్ట్, డిమా హసావో జిల్లాల్లోని మొత్తంగా 6,01,642 మంది ప్రభావితమయ్యారని అధికారులు చెప్పారు. నాగావ్ జిల్లా అత్యధికంగా ప్రభావానికి గురైనట్లు చెప్పారు. కొపిలి, బరాక్, కుషియార నదులు ప్రమాదకర స్థాయిని




మించి ప్రవహిస్తున్నాయి. సహాయ శిబిరాల్లో 50 వేల మంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారు.

## 93 ఏళ్ల వయసులో ఐదో పెళ్లి చేసుకున్న మీడియా మొఘల్....!



బిలియనీర్, మీడియా మెఘల్ రూపర్ట్ మర్డోక్ మరో సారి వార్తల్లో నిలిచారు. 93 ఏళ్ల వయసులో మరోసారి పెళ్లి చేసుకున్నారు. తన ప్రియురాలు 67 ఏళ్ల ఎలీనా జుకోవాను ఐదో పెళ్లి చేసుకున్నారు. ఈ వృద్ధ జంట శనివారం కాలిఫోర్నియాలోని మర్డోక్ ఎస్టేట్‌లో మొఘరాలో వివాహం చేసుకున్నారు. న్యూ ఇంగ్లండ్ పేట్రియాట్స్ యూఎస్ ఫుట్‌బాల్ జట్టు యజమాని రాబర్ట్ క్రాఫ్ట్, ఆయన భార్య డానా బ్లూమ్ బెర్గ్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా నిలిచారు. మర్డోక్ ఇప్పటికే నలుగురిని పెళ్లి చేసుకొని వారితో తెగదెంపులు చేసుకున్నారు. గతేడాది 65 ఏళ్ల యాన్ లెస్లీ స్మిత్ తో ఎంగేజ్మెంట్ చేసుకున్నారు. వీరి ఎంగేజ్మెంట్ కూడా ఘనంగా జరిగింది. తనకు చాలా సంతోషంగా ఉందనీ తను మళ్లీ ప్రేమలో పడ్డాననీ ఇదే తన చివరి వివాహం అవుతుందని నిశ్చితార్థం సమయంలో రూపర్ట్ మర్డోక్ అన్నారు. నాలుగో భార్య అయిన జెర్రీ హాల్‌తో విడాకులు తీసుకుని ఏడు నెలలు కూడా కాకముందే ఆయన లెస్లీతో నిశ్చితార్థం చేసుకొని.. అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. అయితే నిశ్చితార్థం అయిన వారాల వ్యవధిలోనే లెస్లీతో ఆయన బంధం తెగిపోయింది. మర్డోక్ మొదటిసారి ఫ్లైట్ అటెండెంట్ పాట్రీషియా బుకర్‌ను 1956లో వివాహం చేసుకున్నారు.

# సడెన్‌గా హార్ట్ ఎటాక్ వస్తే అల్లం నమలడం మంచిదా..?



ప్రస్తుతం హార్ట్ ఎటాక్ కేసులు అనేవి విపరీతంగా పెరిగిపోతున్నాయి. మనం తీసుకుంటున్నా ఆహారం, జీవన శైలి కారణంగా వయసుతో సంబంధం లేకుండా చాలా మంది గుండె పోటు బారిన పడుతున్నారు. అందువలన వైద్యులు ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండమని సలహా ఇస్తున్నారు. అయితే ఈ హార్ట్ ప్రాబ్లమ్స్, హార్ట్ ఎటాక్‌తో మరణాలు పెరుగుతున్న క్రమంలో సోషల్ మీడియాలో అనేక వార్తలు, వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా మీకు ఈ లక్షణాలు కనిపిస్తే గుండెపోటు వస్తుంది జాగ్రత్త, సడెన్‌గా హార్ట్ ఎటాక్ వస్తే ఈ టిప్ ట్రై చేయండి. హార్ట్ ఎటాక్ రాకుండా ఉండేందుకు బెస్ట్ హోమ్ రెమెడీస్ ఇవే, సీపీఆర్ చేసే విధానం ఇలా అనేక వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు అల్లం నమిలితే సమస్య నుంచి బయటపడ వచ్చునంటూ ఓ వీడియో వైరల్‌గా మారింది. అయితే దీనిపై వైద్యులు స్పందించి క్లారిటీ ఇస్తున్నారు. సడెన్‌గా హార్ట్ ఎటాక్ వస్తే అల్లం నమలడం మంచిదని ఎక్కడా లేదని, దీనికి సైంటిఫిక్ ప్రూఫ్ లేదు, ఇది గుండెపోటును తగ్గిస్తుందని చెప్పడానికి కూడా సరైన ఆధారాలు లేవు అందువల్ల ఇలాంటి వాటిని నమ్మకూడదు అని డాక్టర్ చెప్పుకొచ్చారు. ఒక వేల మీకు సడెన్‌గా గుండెపోటు వచ్చినట్లు అనిపిస్తే ఆస్పిరిన్ ట్యాబ్ లెట్ వాడాలని ఆయన సూచించారు. అలాగే దయ చేసి సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని నమ్మకూడదని, అల్లం నమిలితే గుండెపోటు రాదు అనేది అవాస్తవం, దీనిలో ఎలాంటి నిజం లేదు అని ఆయన కొట్టిపారేశారు.


# సోషల్ మీడియాకు అడెక్ట్ అయ్యారా......

సోషల్ మీడియా గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ ఇందులోనే లీనమై పోతున్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ దీనికి అడెక్ట్ అయిపోయారు. తినకుండానైనా ఉండగలుగుతున్నారు కానీ స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా లేకుండా ఉండలేకపోతున్నారు. ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు వారు సోషల్ మీడియాలోనే జీవిస్తున్నారు. అయితే అసలు ఈ సోషల్ మీడియాలో ఎక్కువగా గడపడం వలన ఎలాంటి అనారోగ్యసమస్యలు వస్తాయో మాత్రం ఎవరూ ఆలోచించడం లేదు. కానీ దీని వలన అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదంట. అవి ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. 2019లో చేసిన ఓ సర్వే ప్రకారం సోషల్ మీడియాలో కంటిన్యూగా 3 గంటలు గడిపే టీనేజర్లలో యాంగ్జైటీ, కోపం, నిరాశ వంటి సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయంట. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెబుతున్నారు. అంతే కాకుండా దీని వలన మరిన్ని ప్రాబ్లమ్స్ కూడా వస్తున్నాయి. అవి ఏంటో ఇప్పుడు చూద్దాం. ఒక మనిషికి కంటినిండా ఆరోగ్యం అనేది చాలా అవసరం. సోషల్ మీడియాకి బానిసైపోవడం వలన ఎవరూ సరిగ్గా నిద్రపోవడం లేదు. అందువలన నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నారు. ఇది ఆరోగ్యానికి అస్సలే మంచిది కాదు అంటున్నారు వైద్యులు. సోషల్ మీడియాకు అడెక్ట్ అయిన వారు ఎటు కదలకుండా ఒకే చోట కూర్చొని లేదా పడుకొని వీడియోలు చూడటం లాంటివి చేస్తుంటారు. దీని వలన వారు విపరీతంగా బరువు పెరిగిపోయి, ఊబకాయం భారినపడే ఛాన్స్ ఉంది అంటున్నారు ఆరోగ్య నిపుణులు. అంతే కాకుండా సోషల్ మీడియా వలన యూత్



తమ విలువైన సమయాన్ని కోల్పోతున్నారని, ఏ పని మీద ఏకాగ్రత పెట్టకపోవడం వలన తాము కొత్తగా ఏదీ నేర్చుకోలేకపోతున్నారు. ఇది వారి కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# చర్మసంరక్షణలో నిమ్మచెక్కలు....



వేసవి తాపానికి చెక్ పెట్టే విషయంలో నిమ్మకాయ ముందంజలో ఉంటుంది. ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉండటమే కాకుండా పొటాషియం, ఐరన్, మెగ్నీషియం, కాపర్, సెలీనియం మొదలైన అనేక పోషకాలు మంచి పరిమాణంలో ఉంటాయి. నిమ్మకాయను షికంజీ తయారీతో సహా ఇంట్లో అనేక వంటకాల్లో, పానీయాల్లో కూడా ఉపయోగిస్తారు. కానీ చాలా మంది దాని తొక్కలను విసిరివేస్తారు. నిమ్మకాయనే కాదు దాని తొక్కలను ఉపయోగించడం వల్ల అనేక పనులు త్వరగా పూర్తవుతాయని చాలామందికి తెలిసి ఉండదు. నిమ్మకాయ షికంజి తయారు చేసిన తర్వాత తొక్కలను పారేస్తూ ఉంటారు. కానీ ఇవి చర్మసంరక్షణలో, దంతాలను కాంతివంతం చేయడంతో పాటు అనేక ఇతర ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. మరి ఆ ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. దంతాల తెల్లగా మెరవాలంటే పాలిష్ చేయడానికి నిమ్మ తొక్కలను ఉపయోగించవచ్చు. నిమ్మతొక్కలో కొద్దిగా ఉప్పు వేసి దంతాల మీద రుద్దాలి. ఇలా కొన్ని రోజుల పాటు చేయడం వల్ల దంతాలు క్రమంగా సహజంగా శుభ్రపడతాయి. నిమ్మ తొక్కలను నీటిలో బాగా ఉడకబెట్టి ఈ వేడి నీటిని నూనె, సుగంధ ద్రవ్యాల వాసన వచ్చే పాత్రలలో పోయండి. కొంత సమయం తరువాత ఆ పాత్రలను శుభ్రం చేయండి. అలా చేయడం వలన పాత్రలు ఎలాంటి జిడ్డు వాసన రాదు. కిచెన్ సింక్ మరకలను నిమ్మ తొక్కలతో తొలగించవచ్చు. ఇందుకోసం నిమ్మతొక్కలను ముక్కలుగా కోసి ఒకటి రెండు గ్లాసుల నీళ్లలో వేసి మరిగించి అందులో ఒక చెంచా బేకింగ్ సోడా, డిష్ వాష్ లిక్విడ్ వేసి కిచెన్ సింక్ శుభ్రం చేయాలి. నిమ్మ తొక్కల సహాయంతో చెమట వాసనను నివారించవచ్చు. ముందుగా నిమ్మతొక్కలతో చంకలను మర్దన చేయాలి. మిగిలిన నిమ్మ తొక్కలు మోచేతులు, మోకాలు వంటి శరీర భాగాల నుండి నలుపును తొలగించడానికి ఉపయోగించవచ్చు. నిమ్మ తొక్కలను ఎండబెట్టి పొడి చేసి ఫేస్ ప్యాక్‌లలో ఉపయోగించాలి.

# నల్లమిరియాల లాంటి కబాబ్ షుగర్...!




భారతీయ వంటగదిలో ఉపయోగించే నల్ల మిరియాలను సుగంధ ద్రవ్యాల రాజు అని కూడా పిలుస్తారు. నలుపు మిరియాలు ఆహారం రుచి, వాసన రెండింటినీ పెంచుతుంది. అయితే ఇది నాణ్యతలో కూడా తక్కువేం కాదు. అయితే ప్రస్తుతం మనం కబాబ్ షుగర్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఇది రంగు, ఆకృతిలో నల్ల మిరియాల లాగా కనిపిస్తుంది. అయితే దాని సువాసన గాఢంగా ఉన్నప్పటికీ దానిలోని కారం కొద్దిగా తక్కువగా ఉంటుంది. నల్ల మిరియాల మాదిరిగానే కబాబ్ షుగర్ కూడా సుగంధ ద్రవ్యాల వర్గంలోకి వస్తుంది. కబాబ్ షుగర్ వాడకం వల్ల ఆహారానికి రుచి, వాసన రావడమే కాకుండా మంచి ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. మరి ఈ కబాబ్ షుగర్ వల్ల కలిగే ప్రయోజనాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. నోటి దుర్వాసనను నివారిస్తాయి.. కబాబ్ షుగర్ బలమైన సువాసన కలిగి ఉంటుంది. ఇది నోటి దుర్వాసనను తొలగించడంలో కూడా సహాయపడుతుంది. అంతేకాదు ఇందులో ఉండే క్రిమినాశక లక్షణాలు దంతాలు, చిగుళ్ళకు సంబంధించిన సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో ప్రభావవంతంగా పరిగణిస్తాయి. పొట్ట ఆరోగ్యానికి..కబాబ్ షుగర్ కడుపు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సహాయపడుతుంది. అంటే ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. దీని వినియోగం వల్ల కొవ్వు అధికంగా ఉండే భారీ ఆహారాన్ని జీర్ణం చేయడం సులభం అవుతుంది. అజీర్ణం, తిన్న తర్వాత కడుపులో భారం, ఉబ్బరం మొదలైన కడుపు సంబంధిత సమస్యలను నివారిస్తుంది. శ్వాసకోశ సమస్యలలో ప్రయోజనం..కబాబ్ షుగర్ తీసుకోవడం వల్ల శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇందులో ఉండే బ్రోంకోడైలేటర్ లక్షణాలు ఊపిరితిత్తులలో గాలి ప్రవాహాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇది శ్లేష్మం తొలగించడంలో కూడా ప్రభావవంతంగా పనిచేస్తుంది. అందువల్ల తేలికపాటి జ్వరం, జలుబు, దగ్గులో ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. మూత్ర సంబంధిత సమస్యలు.. కబాబ్ షుగర్ తీసుకోవడం వల్ల మూత్ర సంబంధిత సమస్యలైన మంటలు లేదా టాయిలెట్ చేసేటప్పుడు నొప్పి వంటి వాటి నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు. మూత్రానికి సంబంధించి ఏదైనా సమస్య ఉంటే కబాబ్ చక్కెర పొడిని సేవించవచ్చు. అయితే మీరు ఏదైనా రకమైన వైద్య పరిస్థితితో బాధపడుతున్నట్లయితే, ముందుగా మీ వైద్యుడిని సంప్రదించండి. కబాబ్ షుగర్ ని వేడివస్తువుగా పరిగణిస్తారు. కాబట్టి వేసవిలో పరిమిత పరిమాణంలో తీసుకోవడం మంచిది. నల్ల మిరియాల మాదిరిగానే కబాబ్ షుగర్ కూడా సుగంధ ద్రవ్యాల వర్గంలోకి వస్తుంది. కబాబ్ షుగర్ వాడకం వల్ల ఆహారానికి రుచి, వాసన రావడమే కాకుండా మంచి ఔషధంగా కూడా ఉపయోగిస్తారు.

# లిచీతో రుచికరమైన పానీయాలు..




వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరచేందుకు మజ్జిగ, నిమ్మరసం, షేక్స్ వంటి అనేక రకాల పానీయాలు తీసుకుంటారు. మామిడిపండును ఇష్టపడేవారు మామిడిపండును ఎక్కువగా షేక్ చేస్తారు. కానీ ఈ సీజన్‌లో చాలా మంది మామిడిపండుతో పాటు లిచీని కూడా ఇష్టపడతారు. దీని జ్యుసి, తీపి, పుల్లని రుచి పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఇంతటి రుచికరమైన లిచి నుంచి మంచి నోరూరించే, శరీరాన్ని చల్లబరిచే పానీయాలు కూడా చేయవచ్చు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందంటున్నారు నిపుణులు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి, విటమిన్ బి-కాంప్లెక్స్ పుష్కలంగా ఉన్నాయి. అదనంగా పాలీఫెనాల్స్, ఫైటోన్యూట్రియెంట్స్ ఫ్లేవనాయిడ్స్ ఇందులో ఉంటాయి. లిచీ శరీరాన్ని హైడ్రేట్ గా, రిఫ్రెష్‌గా ఉంచడంలో సహాయపడుతుంది. అందుకే చాలామంది లిచీతో రుచికరమైన పానీయాలను కూడా తయారు చేసి తాగుతారు. మరి ఆ పానీయాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. దీన్ని తయారు చేయడానికి 8 నుండి 10 లీచీలు, నిమ్మరసం, తేనె లేదా చక్కెర, నల్ల ఉప్పు, రెండు గ్లాసుల నీళ్లు, కొన్ని ఐస్, 4 నుండి 5 పుదీనా ఆకులు అవసరం. దీన్ని చేయడానికి లిచీని తొక్క తీసి, చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. ఇప్పుడు మిక్సీ గ్రైండర్‌లో వేసి బాగా బ్లెండ్ చేయాలి. ఇప్పుడు రుచికి తగినట్లుగా నల్ల ఉప్పు, పుదీనా ఆకులు, తేనె లేదా పంచదార, నిమ్మరసం జోడించండి. దీని తర్వాత జాడీలో అవసరాన్ని బట్టి నీళ్లు పోసి బాగా రుబ్బుకోవాలి. మీ లిచి నిమ్మరసం సిద్ధంగా ఉంది. ఇప్పుడు గ్లాసులో వేసి, దాని పై ఐస్ క్యూబ్స్ వేసి అందరికీ అందించాలి. దీన్ని తయారు చేయడానికి లిచీ నుండి విత్తనాలను తీసివేసి, దాని పై తొక్క, దాని గుజ్జును వేరు చేయండి. దీని తరువాత, తాజా కొబ్బరి పాలు, మీగడను పక్కన పెట్టండి. దీని తరువాత బ్లెండర్లో లిచీ, చక్కెర లేదా తేనె, కొబ్బరి పాలు వేసి బాగా కలపాలి. మెత్తని మిశ్రమం సిద్ధమైన తర్వాత దానికి ఫ్రెష్ క్రీమ్, ఐస్ క్యూబ్స్ వేసి మళ్లీ 10 నుంచి 15 సెకన్ల పాటు బ్లెండ్ చేయాలి. లిచీ కొలాడా సిద్ధం అవుతుంది.

# పెరుగుతో కలిపి ఈ ఆహారాన్ని తింటున్నారా..




సహజమైన ప్రోబయోటిక్ ఫుడ్ పెరుగు జీర్ణక్రియలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది ప్రేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇది కాదు రోజువారీ ఆహారంలో పెరుగుతో సహా శరీరానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఎందుకంటే మంచి మొత్తంలో కాల్షియం, ప్రోటీన్, లాక్టిక్ యాసిడ్, ఫాస్ఫరస్, జింక్, విటమిన్ A, B6, B, 12 వంటి పోషకాలు ఇందులో ఉన్నాయి. దీని వినియోగం మీ ఆరోగ్యానికి అలాగే జుట్టు, చర్మానికి మేలు చేస్తుంది. అయితే పెరుగుని కొన్ని వస్తువులతో కలిపి మీ ఆరోగ్యాన్ని పాడుచేయవచ్చు. పెరుగును అనేక రకాలుగా తింటారు. అనేక వస్తువులతో దాని కలయిక కూడా రుచికరమైన రుచిగా ఉంటుంది. అయితే, పెరుగుతో కొన్ని పదార్థాలు తినడం మానేయాలి. లేకపోతే అజీర్ణం, ఉబ్బరం, చర్మ అలెర్జీలు వంటి సమస్యలు రావచ్చు. పండ్లు, పెరుగు రెండూ మంచి పోషకాలను కలిగి ఉంటాయి. కానీ ఈ రెండు పదార్థాలను కలిపి తినడం వల్ల బరువు పెరుగుతారు. దీని వలన అజీర్ణ సమస్యలు కూడా రావచ్చు. ఎసిడిటీ, ఉబ్బరం మొదలైన సమస్యలు మొదలవుతాయి. పండ్లు, పెరుగు తినడానికి మధ్య దాదాపు 1 నుండి 2 గంటల గ్యాప్ ఉండాలి. ఈ రోజుల్లో ఆహారంలో చాలా ప్రయోగాలు చేస్తున్నారు. కాని పెరుగుతో నాన్ వెజ్ తినడం నిషేధం. ముఖ్యంగా చేపలు తిన్న వెంటనే పెరుగు తినకూడదు. ఎలాంటి నాన్ వెజ్, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కడుపులో గ్యాస్, భారం ఏర్పడుతుంది. పెరుగును చేపలతో కలిపి తీసుకుంటే చర్మానికి ఎలర్జీ వచ్చే ప్రమాదం ఉంది. మీరు ఆయిల్ ఫుడ్ తింటుంటే ఆ సమయంలో పెరుగు తినకుండా ఉండండి. వేయించిన ఆహారం, పెరుగు కలిపి తీసుకోవడం వలన జీర్ణక్రియలో భారంగా ఉంటుంది. గ్యాస్, అజీర్ణం మొదలైన వాటి వల్ల ఇబ్బంది పడవచ్చు. రాత్రిపూట పెరుగు తినడం మానేయాలి. ఎందుకంటే కఫ దోషం పెరిగే అవకాశం ఉంది. అంతే కాదు జీర్ణశక్తి బలహీనంగా ఉన్నవారు రాత్రిపూట పెరుగు తినకుండా మధ్యాహ్నం తినవచ్చు.

# ఆస్తమాతో పిల్లలు బాధపడుతున్నారా..!




ఆస్తమా అనేది ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధి. ఈ వ్యాధి కారణంగా శ్వాసనాళాల్లో వాపు ఉంటుంది. ఆస్తమా వల్ల శ్లేష్మం పేరుకుపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతకు ముందు ఆస్తమా కేసులు వృద్ధులలో మాత్రమే కనిపించేవని. కానీ ఈ రోజుల్లో యువత, పిల్లలలో కూడా ఆస్తమా కేసులు కనిపిస్తున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఆస్తమాతో పిల్లలకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుంది. ఆస్తమా సమస్య ఉన్న పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. వేసవిలో పిల్లల ఆస్తమా మరింత తీవ్రమవుతుంది. అలాంటప్పుడు వాటిని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మరి ఉబ్బసం ఉన్న పిల్లలను ఎలా చూసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. వాకింగ్ వెళ్ళుట.. ఉబ్బసంతో బాధపడుతున్న పిల్లలను వేసవిలో ఖచ్చితంగా ఉదయాన్నే వాకింగ్ కు తీసుకెళ్లండి. వేసవిలో మీ పిల్లలను సాయంత్రం వాకింగ్ కి తీసుకెళ్లకండి. ఎందుకంటే ఈ సమయంలో వేడి గాలులు వీస్తాయి. ఇది మీ పిల్లల సమస్యలను పెంచుతుంది. హైడ్రేటెడ్ గా ఉంచడం.. వేసవిలో పిల్లలను హైడ్రేట్ గా ఉంచడం చాలా ముఖ్యం. మీ బిడ్డకు ఆస్తమా ఉన్నట్లయితే, పిల్లలకు తగిన మోతాదులో నీటిని అందించాలని నిర్ధారించుకోండి.




# బంపరాఫర్ కొట్టేసిన మంగళూరు సోయగం

మంగళూరు సోయగం పూజా హెగ్డేకు గత కొంతకాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు వరుసగా పరాజయం చెందడంతో రేసులో పూర్తిగా వెనకబడిపోయింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాను మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేసిందీ భామ. ఆమె కోరుకున్నట్లుగానే తమిళంలో సూర్య సరసన నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. ప్రస్తుతం సూర్య పీరియాడిక్ చిత్రం 'కంగువ'లో నటిస్తున్నారు. ఇది పూర్తయిన వెంటనే కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్‌లో నటించనున్నారు. సూర్య నటించబోతున్న 44వ చిత్రమిది. ఈ నెలలోనే సెట్స్‌మీదకు వెళ్లనుంది. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డేను ఖరారు చేశారు. 'బీస్ట్' తర్వాత పూజాహెగ్డే తమిళంలో మరే చిత్రంలో నటించలేదు. సుదీర్ఘ విరామం తర్వాత అక్కడ భారీ అవకాశాన్ని దక్కించుకోవడం విశేషం. ఈ చిత్రం తప్పకుండా పూజాహెగ్డే కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందని, ఆమె తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.





# పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


డైనమిక్ హీరో శర్వానంద్ తన ల్యాండ్‌మార్క్ 35వ మూవీ 'మనమే'తో హోల్సమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ని అందించడానికి రెడీగా వు న్నారు. ఈ చిత్రంలో కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీరామ్ ఆది త్య దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యా నర్‌పై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్‌లో నిర్మాత టిజి విశ్వప్రసాద్ అత్యంత గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. 'మనమే' జూన్ 7న థియేటర్లలో గ్రాం డ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ కృతి శెట్టి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ఈ సినిమాలో నా క్యారెక్టర్ పేరు సుభ ద్ర. ఇప్పటి వరకూ నేను చేసిన క్యారెక్టర్స్ కి డిఫరెంట్ గా వుంటుంది. నాకు చాలా కొత్తగా వుం టుంది. ఇప్పటివరకూ క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేశాను. కానీ ఈ క్యారెక్టర్ చాలా స్ట్రిక్ట్ గా వుంటుంది. %-% శర్వానంద్ ప్రతి సీన్‌లో అద్భుతం గా నటించారు. ఇందులో నాకు ఓ ఫేవరట్ సీన్ వుంది. ఆ సీన్ ఎలా చేయాలో అని చాలా అలోచించాను. కానీ శర్వానంద్ చాలా కాజ్యువల్‌గా వచ్చి ఆ సీన్‌ని ఒక్క నిమిషంలో అద్భుతంగా చే శారు. నేను ఆశ్చర్యపోయాను. 'మనమే' స్ట్రాంగ్ ఎమోషన్ కనెక్ట్ వున్న ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్. ఈ సినిమా మా ముగ్గురి క్యారెక్టర్స్ చుట్టూ వుం టుంది. అందుకే మనమే అనే పేరు పెట్టాం. ఇది పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అందరికీ కనెక్ట్ అవుతుంది"అని అన్నారు.

# రామ్ చరణ్ కూతురికి 'కల్కి' టీమ్ గిఫ్ట్






మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూతురు క్లింకారకు కల్కి మేకర్స్ స్పెషల్ గిఫ్ట్ ఇచ్చారు. ప్రభాస్ నటిస్తున్న పాన్ వరల్డ్ చిత్రం కల్కి. ఇటీవల ఈ సినిమాలోని బుజ్జి స్పెషల్ వాహనాన్ని పరిచయం చేశారు. ఈ బుజ్జి వాహనాన్ని పలువురు సెలబ్రెటీస్ కూడా డ్రైవ్ చేశారు. బుజ్జి అండ్ భైరవ పేరుతో యానిమేషన్ టీజర్ ను కూడా మేకర్స్ రిలీజ్ చేశారు. ఇది, చిన్న పిల్లలను బాగా ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలో బుజ్జి వాహన బొమ్మలు, భైరవ స్టిక్కర్స్, టీ షర్ట్సను విక్రయిస్తున్నారు మేకర్స్. వాటిని సెలబ్రిటీ పిల్లలకూ గిఫ్టులుగా పంపిస్తున్నారు. తాజాగా రామ్ చరణ్ కూతురు క్లీంకారకు కూడా ఈ బహుమతులు పింపించారు. దీంతో 'థ్యాంక్స్ కల్కి టీమ్. ఆల్ ది బెస్ట్' అంటూ బుజ్జి బొమ్మతో క్లీంకార ఆడుకుంటున్న ఫొటోను ఉపాసన ఇన్‌స్టా షేర్ చేశారు. కాగా కల్కి మూవీపై అభిమానులతోపాటు, సినీ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.





ఉత్పలదేవిగా ఎవర్‌గ్రీన్ బ్యూటీ..

# టాలీవుడ్ లోకి మీరా జాస్మిన్ రీఎంట్రీ

టైటిల్ స్టోరీ గ్లింప్స్, క్వీన్ శ్వాగ్ గ్లింప్స్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసిన తర్వాత 'శ్వాగ్' మేకర్స్ ఎవర్‌గ్రీన్ బ్యూటీ మీరా జాస్మిన్‌ను ఉత్పల దేవిగా పరిచయం చేశారు. క్యారెక్టర్ ఇంట్రడక్షన్ పోస్టర్‌లో మీరా జాస్మిన్ హెవీ జ్యువెలరీ డిజైనర్ వేర్‌లో రాణిలా కనిపిస్తుంది. ఆమె క్యారెక్టర్‌కు ఇది పెర్ఫెక్ట్ లుక్. కొంత బ్రేక్ తీసుకున్న మీరా జాస్మిన్ చాలా కాలం తర్వాత ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనుంది. శ్రీవిష్ణు, హసిత్ గోలి కాంబినేష లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వింజమర వంశంలో క్వీన్ రుక్మిణి దేవిగా రీతూ వర్మ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఔట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'శ్వాగ్' శ్రీవిష్ణు, హసిత్ గోలీల నుండి మరొక యూనిక్ సినిమా. ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత.

# ఆసియాలో అత్యంత ధనవంతుడు అదానీ



అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా మళ్లీ నిలిచారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) సీఎండీ ముకేశ్ అంబానీని ఆయన వెనక్కి నెట్టారు. ఇటీవల అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు పుంజుకోవడంతో అదానీ సంపద భారీగా పెరగడం కలిసొచ్చింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీ ప్రకారం, 111 బిలియన్ డాలర్లతో అదానీ ప్రపంచ సంపన్నుల జాబితాలో 11వ స్థానంలో నిలిచారు. అంబానీ 109 బి.డాలర్ల సంపదతో 12వ స్థానం దక్కించుకున్నారు. అదానీ షేర్లపై అమెరికా బ్రోకరేజీ సంస్థ జెఫ్రీస్ ఇటీవల సానుకూల రేటింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో గత శుక్రవారం ఆయా కంపెనీల షేర్లు గరిష్ఠంగా 14 శాతం వరకు పెరిగాయి. కొత్తగా రూ.84,064 కోట్ల సంపద జత చేరింది. దీంతో అదానీ గ్రూప్‌లోని 10 నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.17.51 లక్షల కోట్లకు చేరింది. వచ్చే పదేళ్లలో 90 బి.డాలర్లతో వ్యాపార విస్తరణను చేపట్టనున్నట్లు అదానీ గ్రూప్ ఇటీవల ప్రకటించింది. 2022లో కూడా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా అదానీ నిలిచారు. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ నివేదికతో ఆయన సంపద భారీగా తగ్గింది. ఇటీవల షేర్లు మళ్లీ పుంజుకోవడంతో ఈ ఏడాది అదానీ సంపద 26.8 బి.డాలర్లు పెరిగింది. ఇదే సమయంలో అంబానీ సంపద 12.7 బి.డాలర్లు మాత్రమే పెరిగింది. 2014లో 5 బి.డాలర్ల సంపద ఉన్న అదానీ గత పదేళ్లలో 111 బి.డాలర్లకు చేరారు. 2022 సెప్టెంబరులో స్వల్ప కాలం పాటు ప్రపంచంలోనే రెండో అత్యంత ధనవంతుడిగానూ నిలవడం విశేషం.

# ఉన్నత విద్య కోసం కేంద్రం చర్యలు...



చాలాసార్లు ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారు. కానీ 2015లో భారత ప్రభుత్వం ప్రారంభించిన పథకం. పీఎం విద్యా లక్ష్మి ఎడ్యుకేషన్ లోన్ యోజనతో భారతీయ పౌరులు ఎవరైనా తమ ఉన్నత విద్యకు ఆర్థిక సహాయం చేయడానికి బ్యాంకు రుణం కోసం సులభంగా దరఖాస్తు చేసుకోవచ్చు.మీరు కూడా ఎలాంటి ఆర్థిక సమస్యలు లేకుండా మీ చదువును కొనసాగించాలనుకుంటే ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత, మీరు ఈ తదుపరి విద్య కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో పీఎం విద్యాలక్ష్మి పథకం గురించి వివరాలను తెలుసుకుందాం. పీఎం విద్యాలక్ష్మి ప్రభుత్వ పథకం కింద, మీరు బ్యాంకుల నుండి రూ.7.5 లక్షల విద్యా రుణం పొందవచ్చు. విదేశాల్లో చదవాలనుకుంటే రూ.15 లక్షల వరకు విద్యా రుణం లభిస్తుంది. మీరు ప్రధాన్ మంత్రి విద్యా లక్ష్మి యోజన కింద స్కాలర్‌షిప్‌లు, విద్యా రుణాలకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చు. విద్యాలక్ష్మి పోర్టల్‌లో నమోదు చేసుకుని లాగిన్ అవ్వాలి. దీని తర్వాత, అవసరమైన అన్ని వివరాలను అందించడం ద్వారా కామన్ ఎడ్యుకేషన్ లోన్ అప్లికేషన్ నింపాలి. సీఈఎల్ఏఎఫ్ అనేది మీరు బహుళ బ్యాంకుల నుంచి విద్యా రుణాల కోసం దరఖాస్తు చేయడానికి పూరించే ఒకే ఫారమ్. ఈ ఫారమ్‌ను ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) జారీ చేసింది. ఫారమ్‌ను పూరించిన తర్వాత మీరు మీ అవసరాలకు అనుగుణంగా ఎడ్యుకేషన్ లోన్ కోసం శోధించవచ్చు. మీ అవసరాలు, అర్హత మరియు సౌలభ్యం ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చు. సీఈఎల్ఏఎఫ్ ద్వారా విద్యా లక్ష్మి పోర్టల్‌లో ఒక విద్యార్థి గరిష్ఠంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకం కింద 13 బ్యాంకులు కవర్ అవుతాయి. ఈ పథకం కింద 22 రకాల విద్యా రుణాలు ఇవ్వబడ్డాయి. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తర్వాత, మీరు ఈ తదుపరి విద్య కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో పీఎం విద్యాలక్ష్మి పథకం గురించి వివరాలను తెలుసుకుందాం. పీఎం విద్యాలక్ష్మి ప్రభుత్వ పథకం కింద, మీరు బ్యాంకుల నుండి రూ.7.5 లక్షల విద్యా రుణం పొందవచ్చు. విదేశాల్లో చదవాలనుకుంటే రూ.15 లక్షల వరకు విద్యా రుణం లభిస్తుంది.

# టాటా స్టీల్ కీలక నిర్ణయం.. 2500 ఉద్యోగాల కోత




గ్లోబల్ మార్కెట్లో ఎలక్ట్రిక్ ఉత్పత్తులు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో యూకేలోని టాటా స్టీల్ తన సిబ్బందిలో 2500 మందిని తొలగించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని కంపెనీ సీఈఓ టీవీ నరేంద్రన్ తెలిపారు. యూకే టాటా స్టీల్ సంస్థలో ఉద్యోగాలు పోతాయనే భయంతో కార్మికుల సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. నిరసనలు కూడా తెలియజేస్తున్నాయి. యూకే ప్రభుత్వం సాయంతో డీకార్బనైజేషన్ ప్లాన్‌లో భాగంగా.. కర్బన ఉద్గారాలను పూర్తిగా తగ్గించి, ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నేస్ ప్రక్రియకు మారుతోంది. కాబట్టి రాబోయే మూడేళ్లలో కర్బన ఆధారిత తయారీ పూర్తిగా నిలిపివేస్తున్నట్లు సమాచారం.టాటా స్టీల్ సంస్థ యూకేలో ఎలక్ట్రిక్ ఉత్పత్తులను పెంచనుంది. తద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించనుంది. భారత్ కేంద్రంగా పనిచేస్తున్న టాటా స్టీల్ యూకేలో అతిపెద్ద ఉక్కు తయారీ సంస్థగా కీర్తి గడించింది. ఇక్కడ సుమారు 8000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. యూకే కంపెనీ ఏడాదికి 3 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేస్తోంది. ఇందులో సుమారు 2500 మంది ఉద్యోగాలను కోల్పోయే అవకాశం ఉంది. సెప్టెంబర్ 2023లో టాటా స్టీల్ అండ్ యూకే ప్రభుత్వం బ్రిటన్‌లోని పోర్ట్ టాల్బోట్ స్టీల్ తయారీ సదుపాయంలో డీకార్బనైజేషన్ ప్లాన్‌లను అమలు చేయడానికి 1.25 బిలియన్ పౌండ్ల ఉమ్మడి పెట్టుబడి ప్రణాళికపై అంగీకరించాయి. ఇందులో 500 మిలియన్ పౌండ్లు యూకే ప్రభుత్వం అందించింది.


# ఇప్పుడు అమూల్ పాలు మరింత ఖరీదైనవి..!






ద్రవ్యోల్బణ ప్రభావంతో నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఇప్పటికే కందిపప్పు నుంచి కూరగాయల వరకూ ధరలు పైపైకి వెళ్తుండగా.. తాజాగా పాల ధర పెరగడంతో సామాన్య ప్రజలు మరోసారి షాక్‌కు గురయ్యారు. గుజరాత్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ అమూల్ పాల ధరలను పెంచింది. ఈసారి లీటరుకు రూ.2 చొప్పున పెంచారు. జూన్ 3 సోమవారం నుంచి అంటే ఈ రోజు ఉదయం నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. దీంతో లీటరు పాలకు రూ.2 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ధరల పెరుగుదల మూడు అమూల్ పాలకు వర్తిస్తుంది. అమూల్ గోల్డ్, అమూల్ తాజ్, అమూల్ శక్తి లీటర్ పాలు రెండు రూపాయల మేర పెరిగాయి. అంటే ఈ మూడు పాలల్లో ఏదైనా కొనుగోలు చేస్తే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే అమూల్ తాజా నానా పౌచ్ ధరల్లో ఎలాంటి పెంపుదల లేదు. అంటే పాత ధరలకే ఈ పాలు లభిస్తాయి. ఈ పెరుగుదల మొత్తం దేశంలో ఏకకాలంలో జరిగింది. అమూల్ పాల పెంపు అనేది ఏ ఒక్క రాష్ట్రానికో సంబంధించినది కాదని కంపెనీ స్పష్టం చేసింది. అమూల్ కొత్త ధరల ప్రకారం అమూల్ గోల్డ్ హాఫ్ లీటర్ ఇప్పుడు రూ.32 నుంచి రూ.33కి పెరిగింది. అమూల్ తాజా 500 ఎంఎల్ ధర రూ.26 నుంచి రూ.27కి పెరిగింది. అమూల్ శక్తి 500 ఎంఎల్ ఇప్పుడు రూ.29 నుంచి రూ.30కి పెరిగింది. అమూల్ తాజా చిన్న ప్యాకెట్లు మినహా అన్ని పాల ధరలను లీటరుకు రూ.2 పెంచారు. అమూల్ గోల్డ్ 500 %ఎక్షీ% ప్యాక్ ఇప్పుడు అహ్మదాబాద్‌లో రూ. 33కి అందుబాటులో ఉంటుంది. అమూల్ శక్తి ప్యాక్ రూ.30కి, అమూల్ తాజా రూ.27కి అందుబాటులో ఉండనున్నాయి. అంటే ఎన్నికలకు ముందు లీటరు పాలకు రూ.64 ఉండగా.. ఇప్పుడు రూ.66 చెల్లించాల్సి వస్తోంది.

# వాహనదారులకు బిగ్ అలర్ట్...



వాహనదారులకు అలర్ట్.. టోల్ ఛార్జీలు భారీగా పెరిగాయి. దేశవ్యాప్తంగా టోల్ ఛార్జీలు సగటున 5 శాతం పెరిగాయి. పెరిగిన ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే.. పెరిగిన టోల్ రేట్లు మార్చి 31, 2025 వరకు అమల్లో ఉంటాయి.

కార్లు, జీపులు, వ్యాన్‌లకు ఒకవైపు ప్రయాణానికి టోల్ ఛార్జీ రూ.5 పెరగగా.. బస్సులు, ట్రక్కులు ఒక వైపు ప్రయాణానికి 25 రూపాయలు, రెండు వైపులా ప్రయాణానికి 35 రూపాయలు పెరిగాయి. భారీ సరకు రవాణా వాహనాలకు ఒక వైపు ప్రయాణానికి రూ. 35, రెండు వైపులా కలిపి రూ.50 వరకు టోల్ ఛార్జీలు పెంచారు. 24 గంటల్లోపు తిరుగు ప్రయాణం చేస్తే అన్ని వాహనాలకు 25 శాతం రాయితీ లభిస్తుంది. స్థానికుల నెలవారీ పాస్‌పైనా రూ.10 పెంచడంతో.. నెలవారీ పాస్ రేట్ రూ.330 నుంచి 340కి పెరిగింది. వాహనదారులకు ధరలపై ఆందోళన లేకుండా టోల్‌ప్లాజాల వద్ద బోర్డులను ఏర్పాటు చేసినట్లు నిర్వహణ సంస్థ తెలిపింది. ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ఛార్జీలు సైతం పెరిగాయి. ఆర్థిక సంవత్సరం 2024 -25 కి సంబంధించి టోల్ చార్జీలను నగటున ఐదు శాతం పెంచుతున్నట్లు ఐఆర్‌బీ ఇన్ఫ్రా సంస్థ ప్రకటించింది. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నటువంటి హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ నిర్వహణలో ఉండే ఓఆర్ఆర్ ను ఐఆర్బీ సమస్త గత ఏడాది 30 ఏళ్ల వరకు లీజుకు తీసుకున్న విషయం తెలిసిందే. అయితే నిబంధన ప్రకారం ఐదు శాతం వరకు టోల్ చార్జీలను పెంచుకునేటటువంటి వెలుసు బాటు ఉంది. ఇందులో భాగంగానే కొత్త ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయి. వివిధ రకాల వాహనాలను 6 క్యాటగిరీలోగా విభజించి చార్జీలను నిర్ణయించారు. కొత్తచార్జీలపై అవగాహన కోసం టోల్ ప్లాజా వద్ద బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. కాగా.. ఏటా టోల్ చార్జీలను ఏప్రిల్ ఒకటిన పెంచుతారు.

# ఇన్ఫోసిస్‌పై ఐటీ ఉద్యోగుల కంప్లైంట్...!




దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌పై ఐటీ ఉద్యోగుల సంఘం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (ఎన్ఐటీఈఎస్) కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసింది.సుమారు 2,000 మంది క్యాంపస్ రిక్రూట్మెంట్లకు ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను ఈ ఐటీ కంపెనీ పదేపదే ఆలస్యం చేస్తోందని, ఇది ఉద్యోగులకు ఆర్థిక, మానసిక ఇబ్బందులను కలిగిస్తోందని యూనియన్ ఆరోపించింది. ఇన్ఫోసిస్‌లో రెండేళ్లుగా ఆన్‌బోర్డింగ్ జాప్యం కొనసాగుతోందని, దీంతో బాధితులు అనిశ్చితి, ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారని యూనియన్ పేర్కొంది. "ఇన్ఫోసిస్ ఆఫర్ లెటర్లపై ఆధారపడి చాలా మంది ఇతర ఉద్యోగ ఆఫర్లను తిరస్కరించారు. ఇప్పుడు ఆదాయంతోపాటు స్పష్టమైన ఆన్‌బోర్డింగ్ టైమ్‌లైన్ లేకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు, అనిశ్చితిని ఎదుర్కొంటున్నారు' అని ఎన్ఐటీఈఎస్ ఒక ప్రకటనలో తెలిపింది.

# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు!



అంతా ఊహించినట్లుగానే దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. సెన్సెక్స్ ఏకంగా 2,000 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడింగ్ మొదలుపెట్టింది.నిఫ్టీ ఆరంభంలోనే 500 పాయింట్లకు పైగా పుంజుకుంది. ఎన్డీఏ కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలు సూచీల్లో జోష్ నింపాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూలతలూ దన్నుగా నిలుస్తున్నాయి. రూపాయి బలపడడంతో బ్యాంకింగ్, ప్రభుత్వ రంగ సంస్థల షేర్లు రాణించడం కలిసొస్తోంది. ఉదయం 9:23 గంటల సమయంలో సెన్సెక్స్ 1,808 పాయింట్ల లాభంతో 75,769 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 613 పాయింట్ల లాభపడి 23,144 దగ్గర కొనసాగుతోంది. అంతకుముందు సెన్సెక్స్ 76,738.89 దగ్గర, నిఫ్టీ 23,338.70 వద్ద రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో అన్ని షేర్లూ లాభాల్లో ఉన్నాయి. పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఎస్‌బీఐ, ఎల్ అండ్ టీ, యాక్సిస్ బ్యాంక్, ఎం అండ్ ఎం, ఇండస్ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు అత్యధికంగా లాభపడుతున్న షేర్ల జాబితాలో ఉన్నాయి. అమెరికా మార్కెట్లు గతవారాన్ని లాభాలతో ముగించాయి. రేట్ల కోత ఆశలతో నేడు ఆసియా-పసిఫిక్ సూచీలు రాణిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 81.06 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు శుక్రవారం నికరంగా రూ.1,614 కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు సైతం రూ.2,115 కోట్ల వాటాలను కొన్నారు.

# ఆటో గేర్ షిఫ్ట్ వాహనాల ధరలు తగ్గాయ్...!




ఇటీవల కాలంలో ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రతి సారి మాన్యువల్‌గా గేర్లను మార్చుకోకుండా.. ఆటోమేటెడ్‌గా మారగలిగే విధంగా ఉండే ఈ కార్లు డ్రైవర్లకు అదనపు వెసులుబాటును కల్పిస్తాయి. వాస్తవానికి మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వాహనాలతో పోల్చితే ఈ ఆటోమేటెడ్ ట్రాన్స్‌మిషన్ లేదా ఆటో గేర్ షిఫ్ట్(ఏజీఎస్) వాహనాల ధరలు కాస్త ఎక్కువగానే ఉంటాయి. అయితే దేశంలోని టాప్ కార్ల ఉత్పత్తిదారు అయిన మారుతి సుజుకీ కీలకమైన ప్రకటన చేసింది. ఆటో గేర్ షిఫ్ట్(ఏజీఎస్) ఆప్షన్‌తో ఉన్న కార్ల ధరలను తగ్గిస్తున్నట్లు పేర్కొంది. ఆల్టో కే10, ఎస్ ప్రెస్సో, సెలెరియో, వ్యాగన్-ఆర్, స్విఫ్ట్ డిజైర్, బాలెనో, ఫ్రాంక్స్, ఇగ్నిస్ వంటి మోడళ్లకు ఈ తగ్గింపు వర్తిస్తుందని మారుతీ సుజుకీ అధికారికంగా ప్రకటించింది. ఈ తగ్గింపు గత శనివారం నుంచే అమలులోకి వచ్చింది. ఈ తగ్గింపు వెనుక ప్రత్యేకమైన కారణాన్ని మాత్రం కంపెనీ వెల్లడించలేదు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం.. ప్రస్తుతం ఆటో గేర్ షిఫ్ట్(ఏజీఎస్) ఉన్న కార్ల ధరలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో చాలా మంది మాన్యువల్ ట్రాన్స్ మిషన్‌కే మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలో ఏజీఎస్ కార్లను మరింత సరసమైన ధరలకు అందించేందుకు కంపెనీ ఈ తగ్గింపు నిర్ణయం తీసుకొని ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ నిర్ణయంతో అన్ని మారుతీ సుజుకీ ఏజీఎస్ వాహనాల ధరలు రూ. 5,000 తగ్గాయి.

# కేఎల్ శర్మ నుంచి యూసుఫ్ పఠాన్ వరకూ.. కేంద్ర మంత్రులు.. మాజీ మంత్రులను మట్టి కరిపించిన జెయింట్ కిల్లర్స్ వీరే..!

న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలంగా దేశ రాజకీయాల్లో ఆధిపత్యం ప్రదర్శించిన బీజేపీ.. 2024–లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమి తిరిగి అధికారం చేపట్టే అవకాశాలు ఉన్నా.. తక్కువ అంచనా వేసిన కాంగ్రెస్ పార్టీ సారధ్యంలోని ఇండియా కూటమి అనూహ్య ఫలితాలు సాధించింది. అధికార బీజేపీకి గట్టి సవాల్ విసిరింది. సుదీర్ఘంగా సాగిన ఎన్నికల్లో ప్రముఖులు మట్టికరిచారు.



**అమేథీ జెయింట్ కిల్లర్ కిశోర్‌లాల్ శర్మ**

ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి గత ఎన్నికల్లో తొలిసారి ప్రాతినిధ్యం వహించిన కేంద్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ ఓటమి బాటలో ఉన్నారు. గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న కిశోర్ లాల్ శర్మ విజయానికి చేరువలో ఉన్నారు. 25 ఏండ్ల తర్వాత తొలిసారి అమేథీ నుంచి గాంధీయేతర నేత పోటీ చేసి గెలవడం గమనార్హం.

**బారాముల్లాలో ఫరూఖ్ అబ్దులాకు ఓటమి**

జమ్ముకశ్మీర్ రాజకీయాల్లో తొలి నుంచి కీలక పాత్ర పోషించిన నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ఓటమిని అంగీకరించారు. బారాముల్లా నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ గెలుపొందారు. ఇంజినీర్ రషీద్‌ను 'ఎక్స్ (మాజీ ట్విట్టర్)' వేదికగా అభినందించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు.

**మెహబూబాపై ఆధ్యాత్మిక నేత మియాన్ అల్తాఫ్ అహ్మద్ గెలుపు**

బకేర్వాల్, గుజ్జర్ సామాజిక వర్గాల నుంచి ఆధ్యాత్మికనేతగా పేరొందిన మియాన్ అల్తాఫ్ అహ్మద్.. అనంత నాగ్ స్థానం నుంచి విజయం సాధించారు. పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షురాలు, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ పై ఆయన గెలుపొందారు.

**భూపేష్ భాఘేల్‌ను మట్టి కరిపించిన సంతోష్ పాండే**

ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని రాజ్‌నందన్‌గావ్ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించిన బీజేపీ అభ్యర్థి సంతోష్ పాండే.. మాజీ సీఎం భూపేష్ బాఘేల్ మీద విజయం సాధించారు. మూడు దశాబ్దాలకు పైగా బీజేపీకి గట్టి పట్టు ఉన్న స్థానంగా రాజ్‌నందన్‌గావ్ నుంచి భూపేష్ బాఘేల్ ఓటమి పాలవ్వడం కాంగ్రెస్ పార్టీకి నిరాశనే మిగిల్చింది.

**బహరాంపూర్ నుంచి అధీర్‌కు యూసుఫ్ పఠాన్ చెక్**

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో బహరాంపూర్ లోక్ సభ స్థానం నుంచి వరుసగా ఐదుసార్లు గెలుపొందుతూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరికి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి.. రాజకీయ అరంగ్రేటం చేసిన యూసుఫ్ పఠాన్ చెక్ పెట్టారు. సుదీర్ఘకాలంగా అధీర్ రంజన్ చౌదరిపై యూసుఫ్ పఠాన్ విజయం.. మమతా బెనర్జీ కీలక గెలుపుగా భావించవచ్చు.

**సుల్తాన్ పూర్‌లో మేనకాగాంధీ ఔట్**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సుల్తాన్ పూర్ నుంచి సిట్టింగ్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి మేనకాగాంధీ ఓటమి పాలయ్యారు. మేనకాగాంధీపై ఎస్పీ అభ్యర్థి రాంభువాల్ నిషాద్ ఆధిపత్యం ప్రదర్శించారు. 2019లో బీఎస్పీ అభ్యర్థి చంద్రభద్ర సింగ్‌పై 15 వేల మెజారిటీతో గెలుపొందారు.

# నైతిక బాధ్యతతో ప్రధాని మోడీ రాజీనామా చేయాలి : జైరామ్ రమేష్

న్యూఢిల్లీ: ఇండియా కూటమి 200 స్థానాలు కన్నా ఎక్కువ సాధించే దిశలో ఉండడం ప్రధాని మోడీ తన పదవికి రాజీనామా చేయాలనే సంకేతాన్ని సూచిస్తున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు తన ఎక్స్ పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. బీజేపీ ఎక్కువ స్థానాలు కోల్పోవడంతో ప్రధాని మోడీ తప్పనిసరిగా నైతిక బాధ్యత తీసుకుని తన అగ్రస్థానాన్ని వదులుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నేతృత్వం లోని ఎన్‌డిఎ కూటమి మెజార్టీ స్థానాలు గెలిచి, మోడీ మళ్లీ ప్రధాని అవుతారని మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మొత్తం మీద నరేంద్రమోడీ మూడోసారి ప్రధాని అవుతారని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. దీంతో ప్రధాని మోడీ వరుసగా ఎక్స్ పోస్ట్‌ల్లో ప్రజలు తిరిగి ఎన్‌డిఎనే ఎన్నుకుంటారని, ఇండియా కూటమి అవకాశవాది అని వ్యాఖ్యానించారు.



# 11 లక్షల ఓట్ల మెజార్టీతో బిజెపి అభ్యర్థి విజయం



**నల్లగొండ:** లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఇండోర్ లోక్‌సభ స్థానంలో బిజెపి అభ్యర్థి శంకర్ లల్వాణీ 11 లక్షల 75వేల 092 ఓట్ల రికార్డు మెజార్టీతో విజయం సాధించారు. లాల్వాణీ తర్వాత రెండో స్థానంలో నోటాకు 2లక్షల 18వేల 674ఓట్లు పోలవ్వడం గమనార్హం. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి తన నామినేషన్ ఉపసంహరించుకున్నారు. ఇదే లోక్‌సభ ఎన్నికల్లో మరో ఆరుగురు అభ్యర్థులు 5 నుంచి 7లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు. అందులో నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి కూడా ఉన్నారు. ఆయన 5, 59,906 ఓట్లతో గెలుపొందారు. కాగా, 1952 నుంచి మొదలుకొని దేశ లోక్‌సభ ఎన్నికల చరిత్రలో లల్వాణీ సాధించినదే అత్యధిక మెజార్టీ కావడం గమనార్హం. అంతకుముందు వరకు అత్యధిక మెజార్టీ రికార్డు మహారాష్ట్రకు చెందిన ప్రీతమ్ ముండే పేరిట ఉంది. తన తండ్రి దివంగత కేంద్ర మంత్రి గోపీనాథ్ ముండే రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మహారాష్ట్రలోని బీడ్ లోక్‌సభ స్థానానికి 2014లో జరిగిన ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన కూతురు ప్రీతం ముండే ఈ ఎన్నికల్లో 6,96,321 ఓట్ల ఆధిక్యతతో గెలిచి లోక్‌సభ ఎన్నికల్లో సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఆమె సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శంకర్ రావు పాటిల్ 2,24,678 ఓట్లు మాత్రమే పొందారు.

# పవన్ కళ్యాణ్ గెలుపుపై చిరంజీవి ట్వీట్



హైదరాబాద్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విజయంపై ప్రముఖ నటుడు చిరంజీవి ఆసక్తికర ట్వీట్ చేశారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన నిన్ను, తగ్గావని ఎవరు అనుకున్నా అది ప్రజలని నెగ్గించటానికే అని నిరపించిన నిన్ను చూస్తుంటే అన్నగా గర్వంగా ఉంది' అన్నారు. నువ్వు గేమ్ ఛేంజర్ వే కాదు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వి అని అందరూ కొనియాడుతుంటే నా హృదయం ఉప్పొంగుతోంది అన్నారు. 'నీవు ప్రారంభించే కొత్త అధ్యాయంలో నీకు శుభం కలగాలని, విజయం సాధించాలని మనస్పూర్తిగా ఆశిస్తున్నాను' అంటూ ఎక్స్ వేదికలో రాసుకొచ్చారు. కాగా నెటజన్లు దీనిపై వివిధ రకాలుగా స్పందించారు.

# ఎక్కడా ఖాతా తెరవని బిఆర్ఎస్

రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలకు గానూ కాంగ్రెస్, బిజెపి పార్టీలు సమానంగా చెరో 8 స్థానాలు దక్కించుకున్నాయి. కాంగ్రెస్ ఎనిమిది చోట్ల విజయం సాధించగా, బిజెపి 8 స్థానాల్లో విజయం సాధించింది. ఎంఐఎం తన సీటును పదిలపరుచుకోగా, బిఆర్ఎస్ ఎక్కడా ఖాతా తెరవలేకపోయింది. ఖమ్మంలో నామ నాగేశ్వరరావు (బిఆర్ఎస్)పై రఘురాం రెడ్డి (కాంగ్రెస్) విజయం సాధించగా, వరంగల్‌లో ఆరూరి రమేశ్ (బిజెపి)పై కడియం కావ్య (కాంగ్రెస్) విజయ దుందుభి మోగించారు. నల్గొండలో సైదిరెడ్డి (బిజెపి)పై కుందూరు రఘువీర్ రెడ్డి (కాంగ్రెస్) గెలవగా,

మహబూబాబాద్‌లో మాలోత్ కవిత (బిఆర్ఎస్)పై బలరాం నాయక్ (కాంగ్రెస్) గెలుపొందారు. జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ విజయం సాధించారు. భువనగిరిలో చామల కిరణ్ కుమార్ రెడ్డి (కాంగ్రెస్) జయకేతనం ఎగురవేశారు. నాగర్‌కర్నూల్‌లో మల్లు రవి (కాంగ్రెస్), పెద్దపల్లిలో గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్) విజయం సాధించారు. ఎంఐఎం పార్టీ ఒక్క స్థానంలో పోటీ చేయగా, ఆ పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీ వరుసగా ఐదోసారి హైదరాబాద్ ఎంపీగా విజయం సాధించారు.



**లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు వీరే :**

నల్గొండలో కుందూరు రఘువీర్ రెడ్డి (కాంగ్రెస్)
ఖమ్మంలో రఘురాంరెడ్డి (కాంగ్రెస్)
వరంగల్‌లో కడియం కావ్య (కాంగ్రెస్)
మహబూబాబాద్‌లో బలరాం నాయక్ (కాంగ్రెస్)
జహీరాబాద్‌లో సురేశ్ షెట్కార్ (కాంగ్రెస్)
భువనగిరిలో కిరణ్ కుమార్ రెడ్డి (కాంగ్రెస్)
నాగర్‌కర్నూల్‌లో మల్లు రవి (కాంగ్రెస్)
పెద్దపల్లిలో గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్)
సికింద్రాబాద్‌లో కిషన్‌రెడ్డి (బిజెపి)
మల్కాజ్‌గిరిలో ఈటల రాజేందర్ (బిజెపి)
చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బిజెపి)
మహబూబ్‌నగర్‌లో డి.కె.అరుణ (బిజెపి)
మెదక్‌లో రఘునందన్‌రావు (బిజెపి)
కరీంనగర్‌లో బండి సంజయ్ (బిజెపి)
నిజామాబాద్‌లో అర్వింద్ (బిజెపి)
అదిలాబాద్‌లో గోడెం నగేష్ (బిజెపి)
హైదరాబాద్‌లో అసదుద్దీన్ (ఎంఐఎం)

# వరుసగా ఐదుసార్లు ఓటమి.. ఎట్టకేలకు 20 ఏండ్ల తర్వాత సోమిరెడ్డిని వరించిన గెలుపు

హైదరాబాద్: నలభై ఏండ్ల రాజకీయ జీవితం.. కానీ గెలుపు రుచి చూసి 20 ఏళ్లయ్యింది. దాదాపు ఐదుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమినే చవిచూశారు. కానీ ఎట్టకేలకు ఇప్పుడు ఆరోసారి ఘనవిజయం సాధించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి కాకాని గోవర్ధన్ రెడ్డి మీద 14 వేలకు పైగా మెజారిటీతో గెలుపొందారు.



**2004 నుంచి ఓటమే!**

నెల్లూరు జిల్లా సర్వేపల్లికి చెందిన సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి నాలుగు దశాబ్దాల నుంచి యాక్టివ్ పాలిటిక్స్‌లో ఉన్నారు. 1994 ఎన్నికల్లో సర్వేపల్లి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. చంద్రబాబు కేబినెట్‌లో ఐదు శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 1999లో కూడా రెండోసారి గెలిచి మళ్లీ మంత్రి పదవి చేపట్టారు. ఆ తర్వాత వైఎస్సార్ ప్రభంజనంలో 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అదాల ప్రభాకర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇక 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతిలోనూ ఆయనకు పరాజయం తప్పలేదు.

**చివరి నిమిషంలో టికెట్**

2019లో టీడీపీ ఘోర పరాభవం దృష్ట్యా ఈసారి గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వాలని అనుకుంది. ఈ క్రమంలో మూడుసార్లు ఓడిపోయిన వారికి టికెట్ ఇవ్వబోమని నారా లోకేశ్ ప్రకటించారు. దీంతో సోమిరెడ్డి టికెట్‌పై అయోమయం నెలకొంది. తొలి రెండు జాబితాల్లో ఆయన పేరును ప్రకటించలేదు. అయితే చంద్రబాబుతో ఉన్న అనుబంధంతో సోమిరెడ్డి కోడలు శృతికి కూడా టికెట్ ఇవ్వాలని అనుకున్నారు. కానీ సోమిరెడ్డి చక్రం తిప్పారు. వైసీపీ అభ్యర్థి కాకానిని ఎదుర్కోవాలంటే ఆమె అనుభవం సరిపోదని.. తానైతేనే కరెక్ట్ అని అధిష్ఠానాన్ని నమ్మించాడు. ఎట్టకేలకు టికెట్ సంపాదించాడు.

**వర్కవుట్ అయిన సెంటిమెంట్!**

కష్టపడి ఎలాగోలా టికెట్ సంపాదించిన సోమిరెడ్డి.. గెలవడం అనివార్యమైంది. ఈ క్రమంలోనే సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు. ఇవే తనకు ఆఖరు ఎన్నికలని.. మద్దతిచ్చి గట్టెక్కించమంటూ వేడుకున్నారు. చివరకు ఆ సెంటిమెంట్ అస్త్రం వర్కవుట్ అయ్యింది. తాజా ఎన్నికల ఫలితాల్లో కాకానిపై 15,994 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు.

# నాసిక్‌లో కూలిన సుఖోయ్

మహారాష్ట్ర నాసిక్ జిల్లాలో భారత వైమానిక దళం (ఐఎఎఫ్)కు చెందిన సుఖోయ్ ఫైటర్ విమానం మంగళవారం కూలిపోయిందని పోలీసులు వెల్లడించారు. పైలట్, కో పైలట్ సురక్షితంగా దూకారని నాసిక్ రేంజ్ ప్రత్యేక ఇన్‌స్పెక్టర్ జనరల్ డిఆర్ కరాలె 'పిటిఐ'తో చెప్పారు. షిరాస్‌గావ్ గ్రామం సమీపంలోని ఒక పొలంలో విమానం కూలిందని ఐపిఎస్ అధికారి కరాలె తెలిపారు. వింగ్ కమాండర్ బోకిల్, సహ పైలట్ బిశ్వాస్ నడుపుతున్నఫైటర్ జెట్ మంగళవారం మధ్యాహ్నం 1.20 గంటలకు నిఫాద్ తెహసీల్‌లోని షిరాస్‌గావ్‌లో ఒక పొలంలో కూలింది. పైలట్లు ఇద్దరూ సురక్షితంగా బయట పడ్డారని, వారికి స్వల్ప గాయాలు అయ్యాయని మరొక పోలీస్ అధికారి తెలియజేశారు. వారిని హెచ్ఎఎల్ ఆసుపత్రికి తరలించారు. విమానం కూలిన తరువాత మంటలు అంటుకున్నాయి. మంటలను ఆర్పివేశారు. విమానం భాగాలు 500 మీటర్ల పరిధిలో పడ్డాయని ఆయన తెలిపారు. ఐఎఎఫ్, హెచ్ఎఎల్ భద్రత, సాంకేతిక విభాగాల బృందాలు ఆ ప్రదేశాన్ని సందర్శించారు.



# హసన్‌లో ప్రజ్వల్ రేవణ్ణ ఘోర పరాజయం

మహిళలపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటూ అరెస్టయిన ప్రజ్వల్ రేవణ్ణ హసన్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రేయాస్ పటేల్ చేతిలో ఓటమిపాలయ్యారు. హసన్ లోక్‌సభ స్థానం నుంచి జెడియు అభ్యర్థిగా పోటీ చేసిన ప్రజ్వల్ రేవణ్ణ 40,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 25 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ హసన్ లోక్‌సభ స్థానాన్ని చేజిక్కించుకోగలిగింది. గత ఏడాది జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజ్వల్ తండ్రి, మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ కుమారుడు హెచ్‌డి రేవణ్ణ చేతిలో హొలినర్సీపూర్ స్థానంలో శ్రేయాస్ పటేల్ ఓటమి పాలయ్యారు. ఇప్పుడు హసన్ లోక్‌సభ స్థానంలో సిట్టింగ్ ఎంపి ప్రజ్వల్‌ను ఆయన ఓడించారు. ఏప్రిల్ 26న పోలింగ్‌కు కొద్ది రోజుల ముందు ప్రజ్వల్‌కు చెందిన శృంగార వీడియోలు హసన్ నియోజకవర్గవ్యాప్తంగా విస్తృతంగా సర్కులేట్ అయ్యాయి. ప్రజ్వల్ ఓటమికి ఇది కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ప్రజ్వల్‌కు వ్యతిరేకంగా బిజెపికి చెందిన ఒక వర్గం పనిచేయడం కూడా పటేల్ విజయానికి కారణంగా తెలుస్తోంది. హసన్‌లో ఇద్దరు ప్రముఖ రాజకీయ నాయకుల మనవళ్ల మధ్య భీకర పోరాగా హసన్ ఎన్నికను అభివర్ణించవచ్చు. హసన్ తాత హెచ్‌డి వేవెగౌడను శ్రేయాస్ పటేల్ తాత జి పుట్టస్వామి గతంలో హసన్ ఎంపి ఎన్నికల్లో ఓడించారు. కాగా..హసన్ ఎన్నిక ఫలితంపై ప్రజ్వల్ బాబాయ్, జెడిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డి కుమారస్వామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఫలితాన్ని తాము ఊహించలేదని, ఈ ఫలితం తమను అసంతృప్తికి గురిచేసిందని చెప్పారు. ఇలా ఉండగా..బిజెపి, జెడిఎస్ మధ్య ఎన్నికల పొత్తు కమలం పార్టీలో తీవ్ర అసమ్మతికి దారితీసింది. ప్రజ్వల్ అభ్యర్థిత్వాన్ని హసన్ మాజీ ఎమ్మెల్యే ప్రీతమ్ గౌడ తీవ్రంగా వ్యతిరేకించారు.



Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com